



PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 11, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజిలు : 8, వెల రూ. 5, శుక్రవారం - 13 - జూన్ - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## అహ్మదాబాద్ విమాన దుర్ఘటన...


### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో మాట్లాడిన ప్రధాని మోదీ


2

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఫోన్ లో మాట్లాడిన ప్రధాని మోదీ పరిస్థితిని సమీక్షించి, తక్షణ సహాయక చర్యలకు ప్రధాని ఆదేశం

## చైనాలో వినూత్న ప్రయోగం..

### రాకెట్ ద్వారా నిమిషాల్లో వస్తువుల డెలివరీ!


2

న్యూఢిల్లీ : రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులకు చైనా శ్రీకారం చుడుతోంది. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ టావోబావోకు చెందిన ప్యాకేజీలను ఒక ప్రైవేటు రాకెట్ సంస్థ విజయవంతంగా డెలివరీ చేసి, తిరిగి సముద్రం నుంచి రాకెట్‌ను సురక్షితంగా రికవరీ చేసింది. ఈ ప్రయోగం వాణిజ్య అంతరిక్ష రవాణాలో ఒక కీలక ముందడుగుగా నిపుణులు భావిస్తున్నారు. బీజింగ్‌కు చెందిన స్టార్టప్ సంస్థ 'సెపోక్'

2లో

## ఘోర విమాన ప్రమాదం...

### గుజరాత్ సీఎంకు అమిత్ షా ఫోన్



అహ్మదాబాద్ లో కుప్పకూలిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన క్షణాల్లోనే కూలిన విమానం దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అమిత్ షా

# పవన్ ప్రమాణానికి ఏడాది..

- డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేసి నేటితో ఏడాది పూర్తి
- ఈ సందర్భంగా జనసేన పార్టీ ఓ స్ఫూర్తిదాయక వీడియో విడుదల
- పిఠాపురంలో చారిత్రక విజయం, పార్టీకి 100 శాతం స్ట్రైక్ రేట్
- 'గేమ్ ఛేంజర్'గా పవన్ ప్రస్థానాన్ని వివరించిన వీడియో


వివరాలు 2లో..

అమరావతి : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి నేటితో ఏడాది పూర్తయిన సందర్భంగా పార్టీ ఓ ఆసక్తికరమైన వీడియోను సోషల్ మీడియాలో

## కాంగ్రెస్ చెప్పిన 'మార్పు' ఇదేనా?: హరీశ్ రావు


2

గ్రామ పంచాయతీలకు 16 నెలలుగా నిధులు అందడం లేదన్న హరీశ్ రావు

నిధుల కేటాయింపుల్లో ప్రభుత్వం విఫలమయిందని మండిపాటు

బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసిందని వ్యాఖ్య

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత కొంతకాలంగా పంచాయతీలకు నిధులు అందడం లేదని, దీంతో క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు.

# అందుకే తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు

## ఢిల్లీలో విలేకర్లతో ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కాళేశ్వరం నిబంధనల ప్రకారమే జరిగిందన్న ఈటల.. దాన్నే సమర్థించిన కిషన్‌రెడ్డి
- మోదీ, అమిత్‌షా మాటలకు భిన్నమైన ఈ ధోరణి దేనికి సంకేతం?
- ఆ ప్రాజెక్టుపై రెండుమూడు రోజుల్లో అన్ని విషయాలూ చెబుతా
- అధిష్ఠానంతో చర్చ మంత్రివర్గ శాఖలపై కాదు.. కర్ణాటకలో కులగణనపైనే..
- కేసీఆర్ కుటుంబానికి కాంగ్రెస్‌లోకి ప్రవేశం లేదు


వివరాలు 2లో..

ఢిల్లీ: కేసీఆర్, కేటీఆర్, కిషన్‌రెడ్డిల ఆలోచన ఒకటే తీరుగా ఉందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులను వారు అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో విచారణ కమిషన్ ఎదుట ఈటల ఇచ్చిన వాంగ్మూలం.. కేసీఆర్ వాదనలకు అనుగుణంగానే ఉందని, దాన్నే కిషన్‌రెడ్డి కూడా సమర్థించడంలో ఆంతర్యమేమిటని సీఎం ప్రశ్నించారు. తాను ఉన్నంతవరకు.. కేసీఆర్ కుటుంబంలో ఎవరినీ కాంగ్రెస్‌లోకి రానివ్వబోనని స్పష్టం చేశారు. ఢిల్లీకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడిన అనంతరం హైదరాబాద్‌కు పయనమయ్యే ముందు బుధవారం మధ్యాహ్నం తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా

## ఈ ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది

మోదీ పాలనలో దేశం గర్వించేలా అభివృద్ధి జరిగిందన్న ఈటల

ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో నాలుగో స్థానానికి తెచ్చామని వ్యాఖ్య

కేంద్ర నిధులపై రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని మండిపాటు


వివరాలు 2లో..

హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా సాగిస్తున్న సుపరిపాలన ప్రతి భారత పౌరుడు గర్వపడేలా ఉందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. శామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

### అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికరం: పవన్ కల్యాణ్


2

- లండన్ వెళుతున్న విమానం కూలిపోవడం ఊహించలేమని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- 242 మందితో వెళుతున్న విమానం టేకాఫ్ అయ్యాక ప్రమాదం
- వైద్య కళాశాల వసతి భవనాలపై కూలడం మహా విషాదమన్న పవన్
- మృతుల కుటుంబాలకు దేశం బాసటగా నిలవాలని పిలుపు

# సుపరిపాలనలో మొదటి అడుగు...

## కీలక హామీ అమలు: సీఎం చంద్రబాబు

- 67.27 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం అమలు
- ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వం కన్నా 24.65 లక్షల మంది విద్యార్థులకు అదనంగా లబ్ధి
- పథకం కోసం రూ.10,091 కోట్లు, పాఠశాలల అభివృద్ధికి రూ.1,346 కోట్లు కేటాయింపు


2లో

అమరావతి: ఎన్డీయే కూటమికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ఏపీ సీఎం చంద్రబాబు (%జష్ట్ర్రుఅనతీఝఝఎబ%) అన్నారు. కూటమి పాలనకు నేటితో ఏడాది పూర్తయిన సందర్భంగా ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' అమలు చేస్తున్నామని చెప్పారు. "సంపద సృష్టిస్తాం.. ఆదాయాన్ని పెంచుతామని ముందే చెప్పాం. పెంచిన ఆదాయాన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నాం. 'తల్లికి వందనం' పథకం 67 లక్షల మంది విద్యార్థులకు వర్తింపజేస్తున్నాం. దీనికోసం రూ.10,091 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇందులో రూ.1,346 కోట్లు పాఠశాలల అభివృద్ధికి వెళ్తుంది.

## జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం


వివరాలు 2లో..

కూటమి ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ బుక్ రిలీజ్

కూటమి ఏడాది పాలనంతా విధ్వంసమే

కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా అమలు చేయలేదు


2

### అంతర్జాతీయ పరిణామాల దెబ్బ: భారీ నష్టాల్లో ముగిసిన దేశీయ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లలో గురువారం అమ్మకాల వెల్లువ

823 పాయింట్లు కోల్పోయి 81,691 వద్ద ముగిసిన సెన్సెక్స్

### ఏపీలో ఐదు రోజులు వానలే.. ఈ జిల్లాలకు అతి భారీ వర్షసూచన


2

## ఏపీలో కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తి

- సంక్షేమ పథకాల జోరు.. అభివృద్ధి పనుల్లో వేగం
- - ఏడాది పాలనపై కూటమి ప్రభుత్వం
- 'పేదల సేవలో' నుంచి 'తల్లికి వందనం' వరకు పలు పథకాలు ప్రారంభం
- మెగా డీఎస్సీ, పెట్టుబడులతో ఉపాధి కల్పన దిశగా అడుగులు
- ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక చేయూత
- రాజధాని, పోలవరం పనులకు మళ్లీ ఊపు

2



PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# అహ్మదాబాద్ విమాన దుర్ఘటన...
## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో మాట్లాడిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే, ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో గురువారం (జూన్ 12) ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాద వివరాలు, సహాయక చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని మంత్రి రామ్మోహన్ నాయుడు కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. క్షేత్రస్థాయిలో సహాయక, పునరావాస కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించేందుకు తాను తక్షణమే అహ్మదాబాద్‌కు బయలుదేరుతున్నట్లు మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రధానికి వివరించారు. దీనిపై స్పందించిన ప్రధానమంత్రి, ప్రమాద బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను వెంటనే అందించాలని మంత్రికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు. ప్రమాద విషయం తెలియగానే, అన్ని సంబంధిత ప్రభుత్వ ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయని, సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మంత్రి కార్యాలయం పేర్కొంది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. నగరంలోని మేఘాణి ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే విమానం నుంచి దట్టమైన నల్లటి పొగలు కిలోమీటర్ల దూరం వరకు వ్యాపించాయి. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రమాద సమయంలో విమానంలో సుమారు 290 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం దాదాపు 300 మంది ప్రయాణికులను తీసుకెళ్లగల సామర్థ్యం కలది. లండన్‌కు సుదూర ప్రయాణం కావడంతో విమానంలో పూర్తిస్థాయిలో ఇంధనం నింపి ఉంది. ఈ కారణంగానే, విమానం కూలిపోయిన వెంటనే భారీ పేలుడు సంభవించి, పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అత్యవసర సహాయక బృందాలు, అగ్నిమాపక శకటాలు, అంబులెన్సులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. దట్టమైన పొగలు, మంటల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఈ ప్రమాదంలో ప్రాణనష్టానికి సంబంధించి ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు.

# అందుకే తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో పార్టీ పెద్దలతో గత రెండు రోజులుగా జరిగిన చర్చలు తెలంగాణలో మంత్రుల శాఖల కేటాయింపుపై కాదని, కర్ణాటకలో కులగణన అంశంపై మాత్రమేనని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ కులగణన నమూనాను కర్ణాటకలోనూ అమలు చేయాలని నిర్ణయించిన అధిష్ఠానం.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో పాటు తనను పిలిపించి చర్చించిందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా చేరిన వారికి తన వద్ద ఉన్న శాఖలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. పాత మంత్రులెవరైనా పనిభారం పెరిగిన కారణంగా తమ శాఖలను మార్చమని కోరితే తప్ప వాటి జోలికి పోమన్నారు. ఇంతవరకూ ఏ మంత్రీ ఆ విషయంపై తనను కలవలేదని స్పష్టం చేశారు.

కులసర్వే ఆధారంగానే మంత్రివర్గ విస్తరణ

“ఇదివరకు కర్ణాటక ప్రభుత్వం చేసిన కులగణన తెలంగాణ మాదిరి పక్కా ఫార్మాట్‌లో లేదు. కర్ణాటక ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి దాని గురించి వివరించడానికి పార్టీ పెద్దలు నన్ను పిలిచారు. మంగళవారం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో సుమారు గంటన్నరపాటు దీనిపై మాట్లాడాం. తెలంగాణలో చేపట్టింది కేవలం కుల సర్వే కాదు. కుటుంబాల స్థితిగతులను 360 డిగ్రీల్లో తెలుసుకోవడానికి ప్రయత్నించాం. ఇంటింటికీ తిరిగి 60 రోజుల్లో 96.5% కుటుంబాల వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. 3.5% మంది ఆ సర్వేలో పాల్గొనకపోవడంతో వారికి మరోసారి అవకాశం ఇవ్వడానికి టోల్‌ఫ్రీ నంబర్లు, ఆన్‌లైన్ వ్యవస్థ, వార్డులు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి వివరాలు సేకరించే ప్రయత్నం చేశాం. ఈ సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగానే మంత్రివర్గ విస్తరణ చేపట్టి ఎస్సీ, బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాం. కులగణన ఆధారంగా ప్రభుత్వపరమైన చర్యల గురించి మదింపు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటు చేశాం. ఆ కమిటీ సిఫార్సుల ప్రకారం ముందడుగు వేస్తాం.

శాఖల గురించి పార్టీ పెద్దలతో చర్చిస్తే తప్పేముంది?

తాను పార్టీ పెద్దలతో మంత్రి పదవుల గురించి మాట్లాడేందుకు వచ్చి ఉంటే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి, పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి కూడా ఉండేవారు. దానిపై చర్చలేదు కాబట్టే వారెవరూ రాలేదు. మంత్రి పదవుల కేటాయింపు అంశం ముఖ్యమంత్రి అధికార పరిధిలోనిదన్నది వాస్తవమే. ఇక్కడ



నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాదు. అందువల్ల శాఖల కేటాయింపు గురించి పార్టీ పెద్దలతో చర్చించడంలో తప్పు లేదు. భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు దిల్లీ పెద్దలతో మాట్లాడకుండానే మంత్రివర్గ విస్తరణలు చేపడుతున్నారా? దిల్లీలో ఉన్న మీడియా ప్రతినిధులు మీ ప్రధాన కార్యాలయం ఉన్న హైదరాబాద్‌కు వార్తలు పంపుతున్నట్లుగానే నేను మా పార్టీ ప్రధాన కార్యాలయం ఉన్న దిల్లీకొచ్చి మాట్లాడుతున్నా. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడేందుకు నేను 500 సార్లయినా ఇక్కడికొస్తా. నా గురించి అవాకులు చవాకులు మాట్లాడుతున్న భారాస నాయకులు ఉదయం లేచిన దగ్గరి నుంచి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు ఎందుకు వెళ్తున్నారు? మంత్రుల శాఖల కేటాయింపులో కాస్త ఆలస్యమైతేనే కొందరు పనిలేని నాయకులు ఏవేవో మాట్లాడుతున్నారు. కేసీఆర్ హయాంలో ఆరునెలలపాటు మంత్రివర్గమే ఏర్పాటు కాలేదన్న విషయం వాళ్లకు గుర్తులేదా?

# సుపరిపాలనలో మొదటి అడుగు...
# కీలక హామీ అమలు: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

తల్లి లేకపోతే తండ్రి లేదా సంరక్షకుడి ఖాతాలో జమచేస్తాం. అనాథలకు జిల్లా కలెక్టర్ నిర్ణయించిన ప్రకారం వారి ఖాతాల్లో వేస్తాం. తల్లికి వందనం జాబితాను గ్రామ,వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచుతాం. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సరిదిద్ది సహాయం అందిస్తాం. దానికోసం జూన్ 26 వరకు ఫిర్యాదులు స్వీకరించి 30న తుది జాబితాను ప్రకటిస్తాం” అని చంద్రబాబు తెలిపారు.

‘తల్లికి వందనం’ పథకానికి అర్హతలు ఇవే:

దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శాశ్వత నివాసి అయి ఉండాలి. వారి కుటుంబ ఆదాయం ప్రభుత్వం నిర్దేశించిన పరిమితులకు లోబడి ఉండాలి. గ్రామాల్లో నెలకు రూ.10,000.. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12,000 మించకూడదు. ఇప్పటివరకు ప్రభుత్వ డేటాబేస్‌లో నమోదు కాని తల్లులు, పిల్లలు వెంటనే తమ వివరాలను నమోదు చేసుకోవాలి. తల్లులు తమ బ్యాంకు ఖాతాకు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తిచేసి ఉండాలి. బ్యాంకు ఖాతా యాక్టివ్‌గా ఉండటంతో పాటు, ఎన్‌పీసీఐ



తో అనుసంధానం చేసి ఉండాలి. ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. కుటుంబానికి మూడు ఎకరాల లోపు మాగాణి భూమి లేదా పది ఎకరాల లోపు మెట్ట భూమి, లేదా రెండూ కలిపి పది ఎకరాల లోపు భూమి ఉండాలి. విద్యార్థులకు కనీసం 75 శాతం హాజరు తప్పనిసరి.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు:

1. తల్లి మరియు పిల్లల ఆధార్ కార్డులు, 2. నివాస ధృవీకరణ పత్రం (రేషన్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు), 3. ఆదాయ ధృవీకరణ పత్రం, 4. పిల్లల జనన ధృవీకరణ పత్రం, 5. తల్లి బ్యాంకు ఖాతా వివరాలు (పాస్‌బుక్ మొదటి పేజీ లేదా రద్దు చేసిన చెక్కు), 6. విద్యార్థికి సంబంధించిన స్టడీ సర్టిఫికెట్

దరఖాస్తు విధానం:

తల్లికి వందనం పథకానికి ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన తల్లులు తమ గ్రామ లేదా వార్డు సచివాలయాలను సంప్రదించి, అక్కడ అందుబాటులో ఉంచిన దరఖాస్తు ఫారమ్‌ను పూర్తిచేసి, అవసరమైన పత్రాలను జతచేసి సమర్పించాలి. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం, అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేస్తారు. అర్హత పొందిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ఆర్థిక సహాయం జమ చేయబడుతుంది.

# చైనాలో వినూత్న ప్రయోగం..
## రాకెట్ ద్వారా నిమిషాల్లో వస్తువుల డెలివరీ!

న్యూఢిల్లీ : రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులకు చైనా శ్రీకారం చుడుతోంది. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ టావోబావోకు చెందిన ప్యాకేజీలను ఒక ప్రైవేటు రాకెట్ సంస్థ విజయవంతంగా డెలివరీ చేసి, తిరిగి సముద్రం నుంచి రాకెట్‌ను సురక్షితంగా రికవరీ చేసింది. ఈ ప్రయోగం వాణిజ్య అంతరిక్ష రవాణాలో ఒక కీలక ముందడుగుగా నిపుణులు భావిస్తున్నారు. బీజింగ్‌కు చెందిన స్టార్టప్ సంస్థ 'సెపోక్' ఈ అద్భుత ప్రయోగాన్ని మే 29న చైనా తూర్పు తీరంలో నిర్వహించింది. తమ ఎక్స్‌జెడ్‌వై-1 వెరిఫికేషన్ రాకెట్ ద్వారా 20 కిలోలకు పైగా బరువున్న ప్యాకేజీలను రవాణా చేసినట్లు సంస్థ తెలిపింది. ఈ ప్రయోగాత్మక ప్రయాణంలో భాగంగా నేషనల్ లైబ్రరీ అధికారిక ఫ్లాగ్‌షిప్ స్టోర్‌కు చెందిన ఉత్పత్తులతో పాటు, ప్రత్యేకంగా ఈ టెస్టింగ్ కోసం రూపొందించిన స్మారక పోస్ట్‌కార్డులను కూడా పంపించారు. 26.8 మీటర్ల పొడవు, 57 టన్నుల బరువున్న ఈ స్టెయిన్‌లెస్ స్టీల్ రాకెట్ 125 సెకన్ల పాటు ప్రయాణించి, 2.5 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. అనంతరం, షాన్‌డాంగ్ ప్రావిన్స్ సమీపంలోని సముద్ర ఉపరితలంపై నిట్టనిలువుగా విజయవంతంగా ల్యాండ్ అయింది. 18 గంటల పాటు శ్రమించి, రాకెట్‌ను చెక్కుచెదరకుండా వెలికితీసి, తమ కేంద్రానికి తరలించినట్లు సెపోక్ వెల్లడించింది. రాకెట్ చాలా మంచి స్థితిలో ఉందని పేర్కొంది. ఈ రాకెట్ కార్గో బే 120 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగి ఉండగా, ఇది 10 టన్నుల వరకు సరుకులను, కార్లు, చిన్న ట్రక్కులను కూడా రవాణా చేయగలదని సంస్థ తెలిపింది.

భవిష్యత్ అంచనాలు, సవాళ్లు

“ప్యాకేజీ డెలివరీ అయింది, దయచేసి చెక్ చేసుకోండి!” అంటూ ఈ పరీక్ష విజయవంతమైన వెంటనే సెపోక్ వ్యవస్థాపకుడు వెయ్ యి తన మిత్రులకు సందేశం పంపారు. “పరీక్ష పారామితులను అన్ని నిర్ధారిత, తమ నిర్ధారిత, షాక్ అబ్జార్బర్ వంటి అంశాల్లో ఎక్స్‌ప్రెస్ డెలివరీ వేర్‌హౌస్ ఆకెంచిన ప్రమాణాలను అనుగుణంగా ఉందని రుజువు చేశాయి” అని ఆయన వివరించారు. అలీబాబాకు చెందిన టావోబావోతో ఈ రాకెట్ కంపెనీ భాగస్వామ్యం.. చైనాలో రాకెట్ల ద్వారా నేరుగా గమ్యస్థానాలకు సరుకు రవాణా చేసే అభివృద్ధి చెందుతున్న రంగంలో పరిశోధనలకు నిదర్శనమని నిపుణులు అంటున్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం ఖండాంతర డెలివరీ సమయాలను రోజుల నుంచి నిమిషాలకు తగ్గించడం ద్వారా ప్రపంచ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే, ప్రస్తుతానికి సాధారణ వినియోగదారుల డెలివరీలకు అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉందని వెయ్ యి అంగీకరించారు. అందువల్ల, అత్యవసర డెలివరీలు, విపత్తు సహాయం, మారుమూల ప్రాంతాలకు సరఫరాలపై ప్రాథమికంగా దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. “తిరిగి ఉపయోగించగలిగే రాకెట్ల సాధారణ వినియోగం, స్టెయిన్‌లెస్ స్టీల్ ఇంజినీరింగ్ అప్లికేషన్‌తో రాకెట్ డెలివరీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ఆశిస్తున్నాం” అని వెయ్ యి పేర్కొన్నారు. ఏరోస్పేస్ నిపుణుడు కావో మెంగ్ మాట్లాడుతూ, రాకెట్ డెలివరీ అనేది దీర్ఘకాలిక ప్రణాళిక అని, అయితే ఇది ఏదో ఒక రోజు ప్రపంచవ్యాప్తంగా నిజమైన 'ఫ్లాష్ డెలివరీ'ని సాధ్యం చేస్తుందని అన్నారు. “తిరిగి ఉపయోగించగలిగే రాకెట్ రికవరీ టెక్నాలజీ, రాకెట్ బాడీ బలం, మన్నికను ధ్రువీకరించడానికి మరిన్ని పరీక్షలు అవసరం” అని ఆయన అభిప్రాయపడ్డారు. సముద్రం నుంచి రికవరీ చేసిన తర్వాత ఎక్స్‌జెడ్‌వై-1 స్టెయిన్‌లెస్ స్టీల్ రాకెట్ బాడీలో ఎలాంటి డ్యామేజ్ లేదా లీకేజీ సంకేతాలు కనిపించలేదని, తోక భాగంలోని ఇంజన్లు, ఎలక్ట్రికల్ ఉత్పత్తులు మంచి స్థితిలో ఉన్నాయని సెపోక్ తెలిపింది. 2025 చివరి నాటికి తమ తొలి కక్ష్యా ప్రయోగం, రికవరీ మిషన్‌ను అమలు చేయగలమని రాకెట్ కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ రాకెట్ ద్రవ ఆక్సిజన్, మీథేన్ ఇంధనాన్ని ఉపయోగించి ఏడు టన్నుల బరువున్న వస్తువులను 1,100 కిలోమీటర్ల కక్ష్యలోకి చేరవేసేలా రూపొందించబడింది. తదుపరి దశలో రాకెట్ డెలివరీ వేర్‌హౌస్ లేఅవుట్‌ను మరింత మెరుగుపరచనున్నారు. దీని ద్వారా తాజా వ్యవసాయ ఉత్పత్తులు, సున్నితమైన వస్తువులతో సహా రవాణా చేయగల వస్తువుల రకాలను విస్తరించనున్నారు. అలాగే, కార్గో భద్రతను నిర్ధారించడానికి ఒక ఎస్కేప్ వ్యవస్థను కూడా అభివృద్ధి చేయనున్నట్లు సెపోక్ ప్రకటించింది.

# ఘోర విమాన ప్రమాదం...
## గుజరాత్ సీఎంకు అమిత్ షా ఫోన్

న్యూఢిల్లీ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. 242 మంది ప్రయాణికులతో లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన క్షణాల వ్యవధిలోనే కుప్పకూలింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. జనావాసాల మధ్య విమానం కూలిపోయింది. విమానం కూలిన వెంటనే ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. కిలోమీటర్ల దూరం వరకు ఈ పొగలు కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ విమాన ప్రమాద ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన వెంటనే గుజరాత్ ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంమంత్రి, పోలీస్ కమిషనర్‌లతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, అవసరమైన పూర్తి సహాయం అందిస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు.

# ఏపీలో కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తి




అమరావతి : రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో గురువారంతో ఏడాది పూర్తి చేసుకుంది.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం ప్రతిరోజూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గడిచిన ఏడాది కాలంలో అనేక ఆర్థిక సవాళ్లు, సమస్యలను అధిగమించి పలు కీలక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమల్లోకి తెచ్చినట్లు చంద్రబాబు వివరించారు. 'పేదల సేవలో', 'పెన్షన్లు', 'అన్న క్యాంటీన్లు', 'దీపం-2', 'తల్లికి వందనం', 'మత్స్యకార సేవలో' వంటి ఎన్నో పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా మెగా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టామని, పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రైవేటు రంగంలోనూ ఉపాధి కల్పనకు పటిష్టమైన అడుగులు వేశామని చంద్రబాబు వివరించారు. రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, 55 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు రైతు అనుకూల నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఈ నెలలోనే ‘అన్నదాత సుఖీభవ’ పథకం కింద అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో కీలకమైన ఐటీ ప్రాజెక్టుల పనులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని సీఎం తెలిపారు. గతంలో నిలిచిపోయిన రాజధాని నిర్మాణ పనులను, పోలవరం ప్రాజెక్టు పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతం చేశామని పేర్కొన్నారు. దీంతోపాటు, రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నమైన రైల్వే జోన్‌ను సాధించామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించామని వివరించారు. ప్రజల ఆశీర్వాద బలంతో రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏడాది పాలన విజయవంతం కావడానికి సహకరించిన, పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు వేసిన ఈ తొలి అడుగు ప్రజల్లో నమ్మకాన్ని, భరోసాను కలిగించిందని, మలి అడుగు మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది.

# కాంగ్రెస్ చెప్పిన ‘మార్పు’ ఇదేనా?: హరీశ్ రావు

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత కొంతకాలంగా పంచాయతీలకు నిధులు అందడం లేదని, దీంతో క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు. గ్రామ పంచాయతీలకు గత 16 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కావడం లేదని హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. నిధుల కొరత కారణంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను నడిపేందుకు కూడా డీజిల్ లేని దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ తాళాలను ఉన్నతాధికారులకు అప్పగించేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మారితే మార్పు వస్తుందని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, ఇప్పుడు గ్రామాల్లో కనిపిస్తున్న ఈ దుస్థితేనా ఆ మార్పు? అని హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. "ఇది మార్పు కాదు, ఏమార్పు" అంటూ ఆయన తన పోస్టులో ఎద్దేవా చేశారు. గ్రామ స్వరాజ్యానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మాత్రం గ్రామాలకు నిధుల కటకట ఏర్పడిందని హరీశ్ రావు ఆరోపించారు. ఈ నిధుల కొరత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పూర్తిగా కుంటుపడ్డాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# అంతర్జాతీయ పరిణామాల దెబ్బ
## భారీ నష్టాల్లో ముగిసిన దేశీయ సూచీలు

న్యూఢిల్లీ : భారత స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు, అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సూచీలు కుప్పకూలాయి. రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనైన మార్కెట్లు చివరికి నష్టాల్లోనే ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 823.16 పాయింట్లు (1 శాతం) నష్టపోయి 81,691.98 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 81,523.16 పాయింట్ల కనిష్ట స్థాయికి కూడా పడిపోయింది. అదేవిధంగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ కీలకమైన 25,000 మార్కును కోల్పోయి, 253.20 పాయింట్లు (1.01 శాతం) నష్టంతో 24,888.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో టాటా మోటార్స్, టైటాన్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, ఎల్&టి, మహీంద్రా &మ మహీంద్రా షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. ఇవి ఒక్కొక్కటి 2 శాతానికి పైగా పతనాన్ని నమోదు చేశాయి. అయితే, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, బీఈ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో ముగిసి గ్రీన్‌లో నిలిచాయి. బ్రాడర్ మార్కెట్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్100 సూచీ 1.73 శాతం క్షీణించగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్100 సూచీ 1.90 శాతం పడిపోయింది. ఇది మార్కెట్ వ్యాప్తంగా అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది. అన్ని రంగాల సూచీలు నష్టాలతోనే ముగిశాయి. ముఖ్యంగా, నిఫ్టీ రియల్టీ సూచీ అత్యధికంగా 2.02 శాతం పతనమైంది. ఫిన్‌సర్వ్, గోద్రేజ్ ప్రాపర్టీస్, అనంత్ రాజ్, డీఎల్ఎఫ్, ప్రెస్టీజ్, శోభా, బ్రిగేడ్, మాక్రోటెక్ డెవలపర్స్ వంటి ప్రధాన రియల్ ఎస్టేట్ కంపెనీల షేర్లు 3 శాతం వరకు నష్టపోయాయి. ఇంధన, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, మెటల్, ఆర్థిక సేవల వంటి ఇతర రంగాలు కూడా ఒక శాతానికి పైగా నష్టపోయాయి. మార్కెట్ల పతనంపై జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్‌కు చెందిన వినోద్ నాయర్ స్పందిస్తూ, "దేశీయ మార్కెట్లో కన్సాలిడేషన్ ఇప్పుడు లార్జ్-క్యాప్ స్టాక్స్‌కు కూడా విస్తరిస్తోంది. వాల్యుయేషన్ ఆందోళనలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకోవడానికి వెనుకాడేలా చేస్తున్నాయి" అని విశ్లేషించారు. "అంతేకాకుండా, అమెరికా పలు కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ఏకపక్షంగా టారిఫ్‌లను పెంచే యోచనలో ఉంది. దీనిపై వచ్చే ఒకటి రెండు వారాల్లో, జూలై తొలి వారం నాటి గడువుకు ముందే నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇది కూడా మార్కెట్లలో అనిశ్చితిని పెంచుతోంది" అని ఆయన తెలిపారు. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ, ఆర్థికపరమైన రిస్కుల నేపథ్యంలో బంగారం సురక్షిత పెట్టుబడిగా మరోసారి కొనుగోళ్లను ఆకర్షిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, మార్కెట్ భయాలు, అస్థిరతను కొలిచే ఇండియా 'విక్స్' సూచీ 2.54 శాతం పెరిగి 14.01 స్థాయికి చేరింది. ఇది మార్కెట్లో అప్రమత్తత నెలకొందనడానికి సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు.

# పవన్ ప్రమాణానికి ఏడాది..

మొదటి పేజీ తరువాయి

కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను అని పవన్ డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేసి నేటికి ఏడాదవుతోంది. ఈ ఏడాది కాలంలో పార్టీ సాధించిన ప్రగతి, పవన్ కల్యాణ్ రాజకీయ ప్రస్థానంలో కీలక ఘట్టాలను ఈ వీడియోలో పొందుపరిచారు. ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం, 55 గిరిజన గ్రామాలకు 39 కిలోమీటర్ల రోడ్డు వేయడం, కుంకీ ఏనుగులను తీసుకురావడం, ప్రైవేటు ఎలక్ట్రిఫికేషన్ సేఫ్టీ కిట్స్ అందించడం వంటివి వీడియోలో చూపించారు. పార్టీ శ్రేణుల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న ఈ ప్రత్యేక వీడియో, పవన్ ఒక సాధారణ రాజకీయ నేత స్థాయి నుంచి "గేమ్ ఛేంజర్"గా ఎలా ఎదిగారో కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. పిఠాపురంలో జనసేన సాధించిన తొలి ఎన్నికల విజయం ఆ ప్రాంతంలో పార్టీకి 100 శాతం స్ట్రైక్ రేట్ అందించిన తీరు, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను ఆయన తిరగరాసిన విధానం వంటి అంశాలను వీడియోలో ప్రముఖంగా ప్రస్తావించారు. పవన్ కల్యాణ్ సహనం, పట్టుదల, వ్యూహాత్మక పొత్తుల ద్వారా జనసేనను రాష్ట్ర రాజకీయాల్లో అగ్రస్థానానికి చేర్చినట్లు వివరించారు. పవన్ కల్యాణ్ ఇచ్చిన మాటను ఎలా నిలబెట్టుకున్నారో వీడియోలోని వ్యాఖ్యాతలు విశ్లేషించారు. సంకీర్ణ రాజకీయాల్లో తలెత్తే అంతర్గత విభేదాలను చాకచక్యంగా పరిష్కరిస్తూ, ఆయన ప్రదర్శించిన రాజకీయ పరిణతి ప్రధాని నరేంద్ర మోదీ వంటి జాతీయ నాయకుల ప్రశంసలను సైతం అందుకున్న విషయం తెలిసిందే. ఈ వీడియో ద్వారా పార్టీ శ్రేణులకు స్ఫూర్తినిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి, పారదర్శక పాలనకు తమ పార్టీ కట్టుబడి ఉందని ప్రజలకు గుర్తు చేయడమే లక్ష్యమని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి.

# ఈ ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది

మొదటి పేజీ తరువాయి

ఈటల మాట్లాడుతూ... 2014కు ముందు దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదని, దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ప్రజలు నమ్మి అధికారం అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. “సంక్షోభంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను అద్భుతంగా నిలబెట్టి, ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రధాని మోదీ నాయకత్వ పటిమతో ప్రపంచ దేశాలతో భారత్‌కు స్నేహపూర్వక సంబంధాలు మెరుగయ్యాయి” అని తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు భారత మహిళల బొట్టు తుడిచి, భర్తలను వారి కళ్ల ముందే చంపిన దుశ్చర్యకు మోదీ ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా గట్టిగా ప్రతీకారం తీర్చుకుందని ఆయన గుర్తుచేశారు. అనేక ప్రజా సంక్షేమ పథకాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఈటల వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నప్పటికీ... రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రం సహకరించడం లేదని అబద్ధపు ప్రచారం చేయడం దారుణమని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే విజయరామారావు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ముందుంటుందని, అయితే వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రచారంలో కొంత వెనుకబడి ఉందని అభిప్రాయపడ్డారు. “గత కాంగ్రెస్ హయాంలో మంత్రులు కుంభకోణాలు, దోపిడీలకు పాల్పడి ఇప్పటికీ జైలు జీవితం గడుపుతున్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందిస్తోంది” అని ఆయన అన్నారు. మోదీ అధికారంలోకి రాకముందు దేశంలో నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు తీవ్రంగా ఉండేవని, మహిళా రిజర్వేషన్లు, మహిళా బిల్లు ద్వారా ప్రధాని మోదీ దేశాభివృద్ధిలో మహిళలను భాగస్వాములను చేశారని కొనియాడారు. దేశంలోని మారుమూల గ్రామాలకు సైతం మరుగుదొడ్లు నిర్మించిన ఘనత మోదీకే చెందుతుందని విజయరామారావు పేర్కొన్నారు.

# ఫాంహౌస్ కు వెళ్లినా పట్టించుకోలేదు..
## కవితపై కేసీఆర్ ఆగ్రహం

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యవహారం కొంతకాలంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నిన్న ఆమె తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. అయితే, ఈ భేటీ ఆశించినట్లుగా జరగలేదని సమాచారం. వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్సీ కవిత తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నిన్న ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు కేసీఆర్ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కవిత అక్కడికి చేరుకున్నప్పటికీ కేసీఆర్ ఆమెతో మాట్లాడలేదని పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఇదే సమయంలో, అక్కడే ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చిన్న ప్రమాదం జరిగింది. దీంతో అక్కడ ఉన్న పార్టీ నాయకులంతా హడావుడిగా ఆయన వద్దకు పరుగులు తీశారు. గాయపడిన పల్లాను హుటాహుటిన అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ పరిణామాల మధ్యే కేసీఆర్ గదిలో నుంచి బయటకు వచ్చి, కూతురు కవితను పలకరించకుండానే నేరుగా వాహనంలో ఎక్కి బీఆర్కే భవన్‌కు బయలుదేరి వెళ్లారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీలో కవిత భవిష్యత్తుపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్న తరుణంలో తండ్రి నుంచి ఇలాంటి స్పందన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికరం

అమరావతి: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఘోర విమాన ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన అత్యంత విషాదకరమని, ఊహించలేనిదని ఆయన గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, అహ్మదాబాద్ నుంచి 242 మందితో లండన్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విమానం సమీపంలోని వైద్య కళాశాల వసతిగృహ భవనాలపై కూలిపోవడం పెను విషాదానికి దారితీసిందని ఆయన తెలిపారు. ఇటువంటి దురదృష్టకర సంఘటన జరగడం తనను తీవ్రంగా కలచివేసిందని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికరం. 242 మందితో లండన్ బయలుదేరిన విమానం... టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోవడాన్ని ఊహించలేకున్నాం. వైద్య కళాశాల భవనాలపై కూలడంతో ఇది ఒక మహా విషాదంగా మిగిలింది" అని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# కూలిన విమానంలో బ్రిటన్ జాతీయులు...

ఢిల్లీ: లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం అహ్మదాబాద్ నగరంలో కూలిపోయిన ఘటనపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన గురించి తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతోందని ఆయన తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్న వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఈ విమానం కుప్పకూలింది. ఇందులో 242 మంది ఉండగా, వారిలో 53 మంది బ్రిటన్ పౌరులే. ఈ ఘటనపై కీర్ స్టార్మర్ 'ఎక్స్' ద్వారా స్పందించారు. "భారతదేశంలోని అహ్మదాబాద్ నగరంలో, లండన్ బయల్దేరిన విమానం కూలిపోయిన దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. ఆ విమానంలో అనేక మంది బ్రిటిష్ జాతీయులు కూడా ఉన్నారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు నాకు వివరిస్తున్నారు. ఈ తీవ్ర మనోవేదన కలిగించే సమయంలో ప్రయాణికులు మరియు వారి కుటుంబ సభ్యులకు నా ప్రార్థనలు అండగా ఉంటాయి" అని తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఈ ప్రమాదానికి గల కారణాలు, బాధితుల వివరాలు వంటి అంశాలపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

సంపాదకీయం

# ప్రతి 26 సెకన్లకు ఓ ప్రకంపన..

## (విశ్లేషణ)

ప్రతి 26 సెకన్లకు భూమిలో ఓ రహస్య ప్రకంపన నమోదు

1960లలో తొలిసారిగా గుర్తించిన శాస్త్రవేత్తలు

పశ్చిమ ఆఫ్రికాలోని గినియా సింధుశాఖ దీనికి కేంద్రంగా అనుమానం

సముద్రపు అలలు లేదా అగ్నిపర్వతాల చర్యలే కారణమని భావన

"భూమి గుండెచప్పుడు"గా పిలుస్తున్న ఈ ప్రకంపనపై కొనసాగుతున్న పరిశోధనలు

ఇప్పటికీ వీడని మిస్టరీగా మిగిలిపోయిన భూమి స్పందన

మన భూమి అంతర్భాగంలో ఓ వింత ప్రకంపన శాస్త్రవేత్తలను దశాబ్దాలుగా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇది ఎంత బలహీనంగా ఉంటుందంటే, మానవులకు దీని ప్రభావం తెలియదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత సున్నితమైన భూకంపాలను నమోదు చేసే సీస్మోమీటర్లు (భూకంపమాపకాలు) మాత్రం ప్రతి **26** సెకన్లకు ఒకసారి క్రమం తప్పకుండా ఈ సూక్ష్మ ప్రకంపనను రికార్డు చేస్తున్నాయి. శాస్త్రవేత్తలు దీన్ని సరదాగా "భూమి గుండెచప్పుడు" అని పిలుస్తున్నారు. ఈ వింత శబ్దాలను మొదటిసారిగా **1960**వ దశకంలో భూభౌతిక శాస్త్రవేత్త జాక్ ఆలివర్ గుర్తించారు. అప్పట్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో, ఈ ప్రకంపనలకు మూలం హిందూ మహాసముద్రంలోని అట్లాంటిక్ ప్రాంతంలో ఉందని ఆయన అంచనా వేశారు. కొన్ని ప్రత్యేక సమయాల్లో ఈ ప్రకంపనల తీవ్రత పెరుగుతుందని కూడా ఆయన కనుగొన్నారు. ఆ తర్వాత చాలా సంవత్సరాలకు, అంటే **2005**లో కొలరాడో విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుడు మైక్ రిట్జ్‌వోలర్ నేతృత్వంలోని బృందం మరింత ఆధునిక పరికరాలను ఉపయోగించి ఈ ప్రకంపనలను ధ్రువీకరించింది. దీని మూలం పశ్చిమ ఆఫ్రికా తీరంలోని గినియా సింధుశాఖ ప్రాంతంలో, ప్రత్యేకించి బైట్ ఆఫ్ బోనీ వద్ద ఉందని వారు స్పష్టం చేశారు. "మేము ఏదో వింతైన, స్థిరమైన, నిరంతరమైన ప్రక్రియను గమనించాం" అని రిట్జ్‌వోలర్ ఆ సమయంలో తెలిపారు. సాధారణ భూకంపాల మాదిరిగా కాకుండా, ఇది చాలా క్రమబద్ధంగా ఉండటం శాస్త్రవేత్తలను అమితంగా ఆకర్షించింది. ఈ **26** సెకన్ల విరామంతో వచ్చే స్పందనకు కచ్చితమైన కారణం ఏమిటనేది ఇప్పటికీ పూర్తిస్థాయిలో తెలియరాలేదు. అయినప్పటికీ, శాస్త్రవేత్తలు కొన్ని ప్రధాన సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

సముద్రపు అలల ప్రభావం:

బలమైన సముద్రపు అలలు తీరప్రాంతాలను లేదా సముద్ర గర్భాన్ని ఢీకొట్టినప్పుడు, అవి భూమి పొరలలో ఒత్తిడి తరంగాలను సృష్టిస్తాయని భావిస్తున్నారు. ఈ సూక్ష్మ ప్రకంపనలే ఈ **26** సెకన్ల లయకు కారణం కావచ్చనేది ప్రధాన పరికల్పన. గినియా సింధుశాఖలో సముద్రపు అలలు సముద్రగర్భంతో చర్య జరపడం వల్లే ఈ సంకేతం ఉత్పత్తి అవుతుండవచ్చని చాలామంది శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

అగ్నిపర్వతాల చర్యలు:

సముద్రగర్భంలోని అగ్నిపర్వతాల కార్యకలాపాలు లేదా భూమి యొక్క టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు కూడా ఈ ఆవర్తన శక్తి విడుదలకు కారణం కావచ్చనేది మరో సిద్ధాంతం. **2013**లో చైనాకు చెందిన కొందరు పరిశోధకులు, గినియా సింధుశాఖలోని సావో టోమే అనే అగ్నిపర్వత ద్వీపం ఈ ప్రకంపనలకు కేంద్రంగా ఉండవచ్చని సూచించారు. ఈ "భూమి గుండెచప్పుడు" కేవలం శాస్త్రవేత్తల కుతూహలాన్ని రేకెత్తించే అంశం మాత్రమే కాదు. మన గ్రహం యొక్క సంక్లిష్టమైన అంతర్గత వ్యవస్థలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక ముఖ్యమైన మార్గంగా ఉపయోగపడుతుంది. ఈ సూక్ష్మ ప్రకంపనలను అధ్యయనం చేయడం ద్వారా సముద్రాలు, టెక్టోనిక్ ప్లేట్లు, భూమి అంతర్భాగాలు ఎలా పరస్పరం చర్య జరుపుకుంటాయో శాస్త్రవేత్తలు మరింత లోతుగా తెలుసుకోవచ్చు. భవిష్యత్తులో భూకంపాలను గుర్తించడం, వాటిని అంచనా వేయడంలో కూడా ఇది కొంతవరకు సహాయపడగలదని ఆశిస్తున్నారు. అయితే, దశాబ్దాలుగా పరిశోధనలు సాగుతున్నప్పటికీ, ఈ **26** సెకన్ల విరామంతో వచ్చే స్పందన వెనుక ఉన్న అసలు కారణం ఇప్పటికీ ఒక రహస్యంగానే మిగిలిపోయింది. సాంకేతిక పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, భవిష్యత్ పరిశోధనలు ఈ నిగూఢమైన "భూమి గుండెచప్పుడు" వెనుక ఉన్న మిస్టరీని ఛేదిస్తాయని శాస్త్రవేత్తలు దృఢమైన ఆశాభావంతో ఉన్నారు.

# మంతన్ గౌరెల్లి లో దారుణం

### 90 సం. ల వృద్ధురాలి పై అత్యాచారం

### అత్యాచారం చేసి పరారైన దుండగులు

### యాచారం పోలీసులు నిందితుల కోసం గాలింపు

### అతి తొందరగానే పట్టుకుని అరెస్టు చేస్తాం

### సీఐ నందీశ్వర్ రెడ్డి



యాచారం :. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మంతన్ గౌరెల్లి లో దారుణం చోటు చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి 90 ఏండ్ల వృద్ధురాలు తన ఇంట్లో నిద్రిస్తుండగా .. గుర్తు తెలియని వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆమెపై దాడి చేసి , అత్యాచారం చేసి దుండగులు పరారయ్యారు. గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన గ్రామస్తులు ఆమెను చూడగా, రక్తమడుగులు కనిపించింది. వెంటనే యాచారం పోలీసులకు గ్రామస్తులు సమాచార అందించారు. ఘటన స్థలానికి వెంటనే పోలీసులు బయలుదేరారు. వృద్ధురాలిని పరిశీలించగా అదే గ్రామానికి చెందిన గుర్తుతెలియని దుండగులు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరా తీస్తున్నారు. వృద్ధురాలిని హైదరాబాదులో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఆమెకు పరిస్థితి విషమంగానే ఉన్నట్టు తెలిసింది. ఆమెకు ముగ్గురు కుమారులు నిరుపేద కుటుంబం, ఒకరు అమెరికాలో ఉంటున్నాడు, ఇంకొకరు హైదరాబాదులో హెూటల్లో పనిచేస్తున్నాడు. మూడవ కుమారుడు చనిపోయాడు. ఆమె సుమారు 20 సంవత్సరాల నుండి ఒంటరిగాని ఆ గ్రామంలోని జీవిస్తున్నది. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం చాలా బాధాకరమని యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపారు. దుండగులను వెంటనే పట్టుకొని అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉయ్యాల మధు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాభివృద్ధి కోసం కృషి

### విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ



యాచారం ( జూన్ 12):. ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యను అందించే విధంగా కృషి చేస్తున్నామని యాచారం ఎంఈఓ పాండురంగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలో మంతన్ గౌరెల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి అనుభవాగ్నులైన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలో అనుభవం లేని ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థుల నుండి నర్సరీ కేవలం సుమారు 30, వేలు నుండి 10 వరకు లక్షలలో ఫీజులు వసూలు చేస్తున్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం పాఠశాలలకు పంపించాలని విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ బడిలోని నర్సరీ, యూకేజీ, ఎల్కేజీ ప్రభుత్వం అనుమతించింది అన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు సద్వినియం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ కొర్ర అరవింద్ నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఆర్థికంగా అభివృద్ధి తోడ్పడుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రోత్సహించాలని మండల విద్యాధికారని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కోర్ర జ్యోతి, చందు నాయక్, సెక్రటరీ ప్రశాంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కిరణ్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సుజాత, కృష్ణయ్య, వనం భాస్కర్, మౌలాల్ ,సతీష్ కుమార్, అంగన్వాడి టీచర్ జ్యోతి, కిష్టమ్మ, పాల్గొన్నారు.



## వృద్ధురాలిపై అత్యారం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలి

### సిపిఎం మండల కమిటీ సభ్యులు చందు నాయక్ , తావు నాయక్ డిమాండ్



యాచారం (జూన్ 12):. మండల పరిధిలో మంతన్ గౌరెల్లి గ్రామంలో ఒక వృద్ధురాలుపై బుధవారం అర్ధరాత్రి నిద్రిస్తుండగా , అత్యాచారం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్ చందు నాయక్, తావునాయకు డిమాండ్ చేశారు. గురువారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై ఎక్కడో ఒకచోట హత్యాచారాలు, మానభంగాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం చాలా బాధాకరమని అన్నారు. వృద్ధురాలికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కందుల శ్రీరాములు, పార్టీ నాయకులు బట్టు జంగయ్య, కే కుమార్, పంతు నాయక్, భాస్కర్ ,తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న కీర్తి...



చిలుకూరు ( ప్రభాత సూర్యుడు): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన మల్లెపంగు కీర్తి 523 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. ఈ సందర్భంగా సూర్యపేట లో జరిగిన కార్య క్రమంలో మల్లెపంగు కీర్తిని కలెక్టర్ తేజ నందలాల్ పవర్ అభినందించి సీల్డ్ బహుకరించారు. గురువారం పాఠశాలలో హెచ్ఎం కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉపాధ్యాయులు మల్లెపంగు కీర్తి కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉత్తమ పాఠశాలగా చిలుకూరు జడ్పీ హైస్కూల్ ఎంపికైందని తెలిపారు. పాఠశాలలో మంచి ఫలితాలతో పాటు, క్రమశిక్షణ, నైతిక విద్య, ఆటలు ,వ్యాయామం కంప్యూటర్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలి



చిలుకూరు (ప్రభాత సూర్యుడు): మండల కేంద్రంలోని ప్రతి గ్రామంలో నూతన కమిటీలు, ఎమ్మార్పీఎస్ గద్దెలను ఏర్పాటు చేసుకొని జూలై 7 న జరిగే 31వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కార్యక్రమంలో మన జాతి తో పాటు అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేసి ఘనంగా గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున జరపాలని తెలియజేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఆర్థిక ,రాజకీయ ,సామాజిక సమానతలు లేని సమాజం కోసం తీసుకునే రాజ్యాధికార నిర్ణయానికి మనతోపాటు అన్ని వర్గాల ప్రజలను కూడగట్టాలని ఎమ్మార్పీఎస్ చిలుకూరు మండల అధ్యక్షులు మల్లె పొంగు సూరి అన్నాడు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి కోటేష్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు సిద్దెల శ్రీను మాదిగ, ఎం జె ఎఫ్ మండల అధ్యక్షులు కందుకూరి కృష్ణమూర్తి, ఎం ఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షులు ముదిగొండ బాలు, ఎమ్మార్పీఎస్ ,ఎంఎస్ పి, మండల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కార్యాలయం పై ఏసీబీ దాడులు ?

### - కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై ఇంటలిజెన్స్ వర్గాల ఆరా..

### - అధికారుల, ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై ఉన్నత స్థాయి అధికారులు ప్రత్యేక నిఘా !




రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కార్యాలయం పై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ అధికారులపై, సిబ్బందిపై పెద్ద ఎత్తున వస్తున్న అవినీతి ఆరోపణల , ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఎప్పటికప్పుడు ఇంటెలిజెంట్ వర్గాల ద్వారా ఆరా తీస్తున్నట్టు సమాచారం. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి నగర శివారు ప్రాంతం కావడంతో భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా.. మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, అధికారుల, ఔట్సోర్సింగ్ సిబ్బంది తీరుపై ఉన్నతాధికారులపై వస్తున్న ఫిర్యాదుల మేరకు జిల్లా అధికారులు పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ వ్యవహారాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన కమిషనర్ ను, టౌన్ ప్లానింగ్ అధికారిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కటకటాల్లోకి పంపించారు. ఇదే స్థానంలో విధులు నిర్వహించిన మరొక కమిషనర్ విధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై సస్పెండ్ కు గురయ్యారు. రెవిన్యూ విభాగంలో ఆర్వోగా పనిచేస్తున్న అధికారి అక్రమ ఇంటి నెంబర్ల వ్యవహారంలో సస్పెండ్ అయ్యారు. ఈ మధ్య కాలంలో పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ అధికారులపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు వస్తుండడంతో ఏసీబీ అధికారులు పూర్తి స్థాయిలో సమాచారాన్ని సేకరించే పనిలో పడినట్లు తెలుస్తోంది. రోజు రోజుకి ఫిర్యాదులు, ఆరోపణలు పెరుగుతుండడంతో ఏసీబీ అధికారులు పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కార్యాలయం పై ఏ క్షణమైనా దాడులు చేయవచ్చని అత్యంత విశ్వసనీయ సమాచారంగా తెలుస్తోంది. అదే గనుక జరిగితే ఏ అధికారులు బలవుతారోనని సర్వత్ర ఆసక్తికర చర్చ స్థానికంగా నడుస్తోంది.

## విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ప్రభాత సూర్య- తుర్కయంజాల్ : విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులంతా బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి ఆకాంక్షించారు.గురువారం తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని ఇంజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకు ఉచిత నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకో వడానికి ప్రభుత్వం అన్నిరకాల వసతులు కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, నాణ్యతతో కూడిన విద్యను అందిస్తోంది కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని చెప్పారు.తెలిపారు.కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి.మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్ల పల్లి హరిత ధనరాజ్ గౌడ్, ఎంఈఓ జగదీష్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ యువ నాయకులు బొక్క వంశీధర్ రెడ్డి, ఎండి గౌస్ పాషా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆరో శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిన్న సీజ్..నేడు ఓపెన్..!

### - సీజ్ చేసిన 24 గంటల్లో రవీంద్ర భారతి స్కూల్ రీ ఓపెన్

### - స్మశానం పక్కన స్కూల్ రన్

### - విద్యా శాఖ అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహణ

### - అనుమతులు లేవని మూసివేత, తర్వాత తెరుచుకున్న స్కూల్

### - ఎంఈఓ శ్రీనివాస్ పై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు




హయత్ నగర్ - ప్రభాత సూర్యుడు: రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లో మూతపడిన రవీంద్ర భారతి స్కూల్ మళ్ళీ తెరుచుకుంది. అది కూడా రాత్రికి రాత్రే...మళ్ళీ తెరుచుకుంది. స్కూల్ నిబంధనలు పాటించలేదు, అనుమతులు తీసుకోలేదు అని మూసేసిన మండల విద్యాశాఖ అధికారులు...అన్ని సక్రమంగా ఉన్నాయని ఓపెన్ చేశారు. రవీంద్ర భారతి స్కూల్లో స్మశానం పక్కన నడుపుతున్నారు. బిల్డింగు యూనివర్సిటీ కూడా లేదు. అయితే స్మశానం పక్కన ఉంది, భవనానికి మునిసిపల్ ఎన్వోసీ లేదనే కారణాలతో స్కూల్ ని సీజ్ చేస్తున్నామని అధికారులే చెప్పారు., కానీ స్కూల్ సీజ్ చేసిన 24 గంటలలోపే తెరుచుకుంది. రవీంద్ర భారతి స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుందని అనుమతులు లేకుండా పాఠశాల నడుపుతుందని బీసీ సంక్షేమ సంఘం కొన్ని రోజులుగా పోరాటం చేసింది. ఆ పోరాట ఫలితంగా రవీంద్ర భారతి స్కూల్ పై విద్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ...తిరిగి తెరుచుకునేలా ఎలా సాధ్యం అయ్యిందని చర్చ జరుగుతోంది. అధికారులే అమ్ముడు పోయి స్కూల్ ని మళ్ళీ తెరిపించారా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

స్కూల్ మళ్ళీ 24 గంటల్లో తెరచుకోవడానికి కారణం ఏంటి ?

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణ జరుగుతుందని సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు ఒక్కరోజు గడవకముందే పాఠశాల రీఓపెన్ కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాత్రికి రాత్రి పెద్ద ఎత్తున తాయిలాలు చేతులు మారడంతోనే తెల్లవారేసరికి ఓపెన్ అయ్యిందని పలువురు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నారు. క్లుప్తంగా పరిశీలిస్తే..హయత్ నగర్ లో రవీంద్ర భారతి పేరుతో స్కూల్ అక్రమంగా నడిపిస్తున్నారు. ఐతే.. పాఠశాల భవనం స్మశానం పక్కనే ఉంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ నడిపిస్తున్నారు. విద్యా శాఖ అనుమతులు కూడా ఈ పాఠశాలకు లేవు. రవీంద్ర భారతి స్కూల్ పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేసింది. టిబిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శివ కుమార్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఎర్ర శ్రీహరి గౌడ్ ఫిర్యాదు చేసారు. దీంతో జిల్లా విద్యా శాఖ అధికారులు స్కూల్ పై చర్యలు తీసుకున్నారు. వెంటనే మూసి వేయాలని నోటీసులు ఇచ్చింది. నోటీసులు ఇచి మూసేసిన 24 గంటల్లో తెరచుకోవడంతో అధికారులపై పలు అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహణ వాస్తవమే..

ఫిర్యాదుల మేరకు స్మశాన వాటిక పక్కనే రవీంద్ర భారతి పాఠశాల నడిపిస్తున్నారనేది నిజం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కూల్లో మళ్లీ ఓపెన్ చేశాం.

బి శ్రీనివాస్, మండల విద్యాధికారి, హయత్ నగర్



## జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి...

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ.

ఎల్లారెడ్డిపేట : ఈ నెల 14వ తేదీ శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, కక్షిదార్లు జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని ప్రజలకు సంబంధించిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించు కోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

## విద్యతో ఆర్థిక అసమానతలు దూరం

### విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి.



ఎల్లారెడ్డిపేట : విద్యతోనే సమాజంలో ఆర్థిక అసమానతలు దూరమవుతాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణం గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల యునిఫామ్స్, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 720 మంది విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు,యునిఫామ్స్ ఇతర సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. ప్రతి విద్యార్థి డాక్టర్, ఇంజనీర్, లాయర్ ఇతర ఉన్నత ఉద్యోగాలు, తాము ఎంచుకున్న రంగమే లక్ష్యంగా చదవాలని వాటిని సాధించాలని ఆకాంక్షించారు. దీంతో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చుకునే అవకాశం వస్తుందని వివరించారు. ప్రతి విద్యార్థి పుస్తకాలలోని ప్రతి అంశంపై లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. ప్రతిరోజు జరిగే పాటలకు సంబంధించి అంశాలను స్కూలుకు రాకముందే చదివి వెళ్లాలని, దీంతో ప్రతి అంశంపై సమగ్ర అవగాహన వస్తుందని తెలిపారు. పాఠ్యాంశాలలో అనుమానాలను ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ పాఠశాలలోని విద్యార్థులకు అన్ అకాడమీ ద్వారా ఐఐటి, నీట్ తదితర పోటీ పరీక్షలపై శిక్షణ అందించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పేరెంట్ టీచర్ మీటింగ్లో సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లాలని, అలాగే ఎంఈఓ, డీఈఓ ఇతర అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో భోజనం తయారు చేసే విభాగంలో కట్టెల పొయ్యిని వెంటనే తొలగించాలని సిలిండర్లపై సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా విద్యాధికారి వినోద్, ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.



## మతసామరస్యాన్ని చెడగొట్టేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవు

**వాట్సప్ గ్రూపు అడ్మిన్లు, వాట్సాప్ లలో ఫార్వర్డ్ చేసే వ్యక్తులు జాగ్రత్తలు పాటించాలి.**

**చర్చి విషయంలో వీడియోను వైరల్ చేసిన కారణంగా బండారి సంతోష్ పై**

**అదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.**

మతసామరస్యాన్ని చెడగొట్టేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు. ఈరోజు పట్టణంలోని ఒక చర్చి విషయంలో బండారి సంతోష్ అనే వ్యక్తి కావాలని వాట్సప్ గ్రూపుల నందు సున్నితమైన అంశాలను ఫార్వర్డ్ చేస్తూ మత సామరస్యాన్ని చెడగొట్టేలా వ్యవహరించిన కారణంగా అతనిపై ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూప్ లో యజమానులు, అడ్మిన్లు, ఫార్వర్డ్ చేసే వ్యక్తులు జాగ్రత్తలు పాటించాలని ఎలాంటి అనవసర విషయాలను, మతసామరస్యాన్ని చెడగొట్టేలా ఉన్న అంశాలను ఫార్వర్డ్ చేయకూడదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వాట్సప్ గ్రూపు అడ్మిన్ లపై మరియు ఫార్వర్డ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తుందని వాటిని కొట్టేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## చింతపల్లి మండల కేంద్రంలో వాహన తనిఖీలు

### చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్మూర్తి.



చింతపల్లి, జూన్ 12: రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్న నేపథ్యంలో పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చింతపల్లి పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం చింతపల్లి మండలం కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులను పరీక్షించగా 3 గురు, వాహనానికి సంబంధించిన వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులు దొరికారని వారిపై కేసులు నమోదు చేశామని చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్ర మౌళి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, వంశీ కళ్యాణ్, రామలింగం, చంటి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కూన రాములు మృతి బాధాకరం

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి.**



చింతపల్లి, జూన్ 12: చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామం విరాట్ నగర్ కాలనీ చెందిన కూన రాములు మృతి బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం కూన రాములు మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రాములు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుంది

### మీ నిజాయితీయే.. మీ విలువైన ఆస్తి

### చార్టెడ్ అకౌంట్లకు కేంద్రంగా హైదరాబాద్



రంగారెడ్డి. జూన్ 12: తెలంగాణ రైజింగ్.. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఇనిస్ట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఇండియా , హైదరాబాద్ శాఖల ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో ఏర్పాటుచేసిన – విద్యార్థుల జాతీయస్థాయి సదస్సులో డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్డు తో పాటు అనేక పరిశ్రమలకు కేంద్రంగా తెలంగాణ మారిందని అన్నారు. ఐటీ, ఫార్మా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్స్ టైల్ పార్క్ వంటి వాటితో అభివృద్ధిలో ప్రపంచ పటంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకుందని వివరించారు. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ దేశవ్యాప్తంగా బయటికి వస్తున్న – విద్యార్థులకు కూడా వేదికగా మీ ముందు ఉందని అన్నారు. %జూా% కోర్స్ పూర్తి చేసుకుని వస్తున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భరోసా ఇచ్చారు. భారతదేశ ఆర్థిక, ధన, వినియోగ నైతికతకు మూల స్తంభంగా ఇనిస్ట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఇండియా నిలుస్తుంది అన్నారు. చార్టెడ్ అకౌంట్ టెంట్లు నైతికతకు కట్టుబడి ఉండాలని, టెక్నాలజీ ఆటోమేషన్ శరవేగంగా పెరుగుతున్న ఈ యుగంలో మీ నిజాయితీయే మీకు అత్యంత విలువైన ఆస్తి, మీ పని ఎల్లప్పుడూ నిజాయితీ, సమన్యాయం బాధ్యతను ప్రతిబింబించాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

1949 లో పార్లమెంటు చట్టంతో స్థాపించబడిన ఇనిస్ట్యూట్ ఆఫ్ చార్టర్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియన్ హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ సంస్థ ఆర్థిక క్రమశిక్షణ, వృత్తిపరమైన విలువలు, ప్రజల నమ్మకానికి ఒక నిలువెత్తు నిదర్శనం అన్నారు. దేశవ్యాప్తంగా 4.26 లక్షలకు పైగా సభ్యులు, దాదాపు పది లక్షల మంది విద్యార్థులతో మీరు ఒక బలమైన ఆర్థిక శక్తిగా మారారని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. ఇందులో హైదరాబాద్ బ్రాంచ్ పాత్ర మరింత విశిష్టమైనది 14,500 మందికి పైగా సభ్యులు, 31,000 మందికిపైగా విద్యార్థులతో ఇది %×జూా×% కి విలువైన ఆభరణంగా నిలిచింది మీరు కేవలం అంకెలు, సంఖ్యలు కాదు ఒక శక్తి, ఒక ఆశయం, ఒక ప్రతిభకు ప్రతీక అన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ కావడం అంటే పరీక్షలు పాస్ కావడమే కాదు ఇది నిరంతర అభ్యాసం, అనుభవం, వ్యక్తిత్వ వికాసాన్ని కలగలిపిన ఒక ప్రయాణం అని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఆర్థిక మంత్రిగా మీ వృత్తిపరమైన ప్రభావాన్ని ప్రతిరోజు చూస్తుంటాను చార్టెడ్ అకౌంట్ లు కేవలం అంకెలు సంఖ్యలు చూసేందుకే పరిమితం కారు మీరు నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూస్తారు ప్రమాణాలను పాటిస్తారు సంక్లిష్టతకు స్పష్టత తీసుకొస్తారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సేవలందించే ప్రతిభావంతులైన వృత్తి నిపుణులను %×జూా×% తయారు చేయడం మనందరికీ గర్వకారణం అన్నారు. సీఏ విద్యార్థులు కేవలం ఒక ఉద్యోగం కోసం సిద్ధం కావడం లేదు. మీరంతా భవిష్యత్తులో వ్యాపారాలు, సంస్థలు, ప్రభుత్వాల ఆర్థిక ఆరోగ్యానికి బాధ్యత వహించేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఒక చార్టెడ్ అకౌంటెంట్ బాధ్యతలు బ్యాలెన్స్ సీట్లకే పరిమితం కావు మీరు అభివృద్ధికి భాగస్వాములు, ప్రజల నమ్మకానికి రక్షకులు, నీతి నిర్వహణకు మార్గదర్శకులు అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈరోజు భారతదేశము ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్న సమయంలో చార్టెడ్ అకౌంట్ లో పాత్ర మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. బిజినెస్ రిఫార్మ్, స్టార్టప్ లకు చేయూత, ప్రజా ఆర్థిక వ్యవస్థల బలోపేతం ఇవన్నీ సీఏ ల పాత్రతోనే ముందుకు సాగుతాయి అన్నారు. బ్లాక్ చైన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో కూడిన అకౌంటింగ్, డిజిటల్ పన్నుల వంటి అంశాల్లో పరిణామాలు వేగంగా జరుగుతున్నాయి ఈ నేపథ్యంలో సమకాలీన పరిజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవాలని డిప్యూటీ సీఎం %జూా% విద్యార్థులకు సూచించారు. మీ ప్రతిభను కేవలం సంపాదనకే కాకుండా సేవకు వినియోగించాలి, సోషల్ ఆడిట్లు చేయండి, చిన్న వ్యాపారాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వ ఆర్థిక ప్రణాళిక కార్యక్రమాలలో పాల్గొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం ఆశించారు. మీలో చాలామంది భవిష్యత్తులో సొంత సంస్థలు స్థాపిస్తారు మీరు ఉద్యోగులుగా కాకుండా ఉద్యోగ దాతలుగా మారాలని కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని డిప్యూటీ సీఎం సీఏ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కష్టపడి సాధించాల్సిన ఉన్నత మార్గాన్ని ఎంచుకున్నందుకు సిఏ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. %జూా% ప్రయాణం అంత సులభమైనది కాదు కానీ ఎంతో సార్థకమయింది, మీ విజయం కేవలం మీకు మాత్రమే చెందదు అది భారతదేశ పురోగతికి చేయూతనిస్తుందని, గొప్ప వృత్తి గౌరవాన్ని ఎప్పటికీ నిలబెట్టాలని తాను కోరుకుంటున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.



# పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులు ఒక కళ మాత్రమే కాదని గుర్తింపుకు చిహ్నం

– పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులు ఒక కళ మాత్రమే కాదని, గుర్తింపుకు చిహ్నం అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి గ్రామం లో ఇక్కత్ చేనేత కార్మికులతో మాట్లాడటమే కాకుండా, పోచంపల్లి టూరిజం టెక్స్టైల్ పార్కులో పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులను పరిశీలించారు. అంతేకాక చేనేత కార్మికులతో ముఖా ముఖి మాట్లాడి చేనేత కార్మికుల సంక్షేమం, వారి స్థితిగతులు, సమస్యలను తెలుసుకున్నారు . అనంతరం రాష్ట్ర గవర్నర్ టెక్స్ టైల్ పార్కు సమావేశ మందిరంలో నేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ చేనేత అనేది ఒక కళ అని ,ప్రత్యేకించి పోచంపల్లి ఇక్కత్ చీరలు, ఉత్పత్తులు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయని ,ఇటీవల ప్రపంచ సుందరీ మణుల సందర్శనతో 30 శాతం అమ్మకాలు పెరిగాయని తెలియడం సంతోషమని అన్నారు. పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులను ఎలా తయారు చేస్తారో తాను స్వయంగా చూసి తెలుసుకున్నానని, గతంలో పోచంపల్లి చీరల పై పుస్తకాల్లో మాత్రమే చదివానని, ఇది తనకు మంచి అనుభవం అని అన్నారు. పోచంపల్లి గ్రామంలో చేనేతలో చాలామంది నిష్ణాతులు ఉన్నారని, ఆఫ్ సిల్క్, కాటన్ వంటి అన్ని రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారని ,భవిష్యత్తులో పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులకు మంచి అవకాశాలున్నాయని తెలిపారు. అయితే పోచంపల్లి ఉత్పత్తులకు మరింత ప్రాచుర్యం తో పాటు ,మార్కెటింగ్ తీసుకువచ్చేందుకు అహ్మదాబాద్ లోని ఎన్ ఐ టి, ఐ ఐ టి సహకారంతో స్థానిక నేత కార్మికులు కలిసి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని, ప్రత్యేకించి మార్కెటింగ్ , డిజైనింగ్ ,డయింగ్ అన్ని విషయాల్లో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు . పోచంపల్లి చేనేత కార్మికుల తో మాట్లాడిన అనంతరం ఇక్కత్ ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అంతేకాక నకిలీ ఇక్కత్ సమస్యను కూడా నేత కార్మికులు చెబుతున్నారని, ఈ రెండింటిని గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు .ప్రస్తుతం పోచంపల్లి నేత కార్మికులు నేతతోపాటు, ఉత్పత్తి ,కలర్ ,మార్కెటింగ్, డిజైనింగ్ అన్ని వారే చూడడం వల్ల ఇక్కత్ ఉత్పత్తులను విస్తృతి చేసేందుకు అవకాశం లేదని తెలిపారు. మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించినట్లయితే చేనేత కార్మికులను కాపాడిన వారమవుతామని,ఇక్కత్ చేనేత వారసత్వంగా వస్తున్న ఒక కళ అని అన్నారు.హ్యాండ్లూమ్స్ కూడా హ్యాండీక్రాఫ్ట్ కోవలోకే వస్తాయని, అలాంటి పోచంపల్లి చేనేత ఉత్పత్తులలో భాగంగా దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ అవార్డు పొందిన వారు కూడా పోచంపల్లి గ్రామంలో ఉండటం అభినందనీయమని అన్నారు. నేత కార్మికులకు ఉన్న సమస్యలు చాలా చిన్నవని, వాటిని సులభంగా పరిష్కరించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల కు ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు బాగున్నాయని చెప్పారు. పోచంపల్లి ఇక్కత్ చీరలు తెలంగాణ వ్యాప్తంగానే కాకుండా, దేశంలోని ప్రతి మూలకు తీసుకువెళ్లవచ్చని, కార్మికులు ఇలాగే పని చేసుకుంటూ ముందుకు వెళ్లాలని అన్నారు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ స్థాయి లాంటి వ్యక్తులు పోచంపల్లి ఉత్పత్తులను పరిశీలించేందుకు రావడం రెండవసారి అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తూ ఆదుకుంటున్నదని, ముఖ్యంగా త్రిఫ్ట్ స్కీమ్, ఇన్సూరెన్స్ స్కీమ్, రుణమాఫీ, నేతన్న భరోసా, వంటి పథకాల ద్వారా సహకారం అందిస్తున్నామని తెలిపారు . అలాగే నేత కార్మికుల కోసం ప్రత్యేకించి కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును ప్రతి సంవత్సరం ఇస్తున్నామని, ఇందులో భాగంగా 25 వేల రూపాయల నగదు, శాలువాతో సన్మానిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేతలు వివిధ రా ప్రాంతాలలో అభివృద్ధి చెంది ఉన్నాయని, పీతాంబరి చీరలు, ఆర్మూర్ చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు ప్రసిద్ధి అని తెలిపారు.టెస్కో ద్వారా చేనేత మెటీరియల్ సేకరిస్తున్నామని, ఈ సంవత్సరం పోచంపల్లి రా మెటీరియల్ ను 6 కోట్ల రూపాయలతో



సేకరిస్తున్నట్లు తెలిపారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి గ్రామానికి ప్రపంచ సుందరి మణులు రావడం వల్ల పోచంపల్లి ఉత్పత్తుల అమ్మకాల మార్కెటింగ్ 30 శాతం పెరిగిందని, అంతే కాక ప్రపంచ వ్యాప్తంగా పోచంపల్లికి ప్రచారం వచ్చిందని , రాష్ట్ర గవర్నర్ రాకతో పోచంపల్లి మరోసారి ప్రాచుర్యం పొందిందని అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కు యాదాద్రి భువనగిరి జిల్లా కు త్రిఫ్ట్ పథకం కింద 90 కోట్ల రూపాయలు ఇచ్చిందని, అలాగే రుణ మాఫీ కింద ఆర్థిక సహాయం ఇవ్వనుందని, నేతన్న భరోసా ,నేతన్న బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు . యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ గవర్నర్ లాంటి వ్యక్తులు నేతన్నలను ప్రోత్సహించడం సంతోషకరమని అన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఐఐటి, ఎన్ఐటి ద్వారా మరింత మెరుగైన విధంగా పోచంపల్లి ఉత్పత్తులను పెంపొందించుకునేందుకు అవకాశాలున్నాయని, పోచంపల్లి లో దశాబ్దాల తరబడి చేనేత కార్మికులు ఉత్పత్తులను తయారు చేస్తున్నారని, ముఖ్యంగా మహిళా కార్మికులు చేనేత చీరల తయారీలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారని , దీని ద్వారా ప్రతి నెల 15 నుండి 20 వేల వరకు వారు సంపాదిస్తున్నారని, అయితే మారుతున్న పరిస్థితుల దృష్ట్యా చేనేత కార్మికులు అదనపు ఆదాయాని కై ప్రభుత్వానికి నివేదిస్తున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని త్వరలోనే మార్కెటింగ్, డిజైనింగ్ వంటివి ఎలా అభివృద్ధి చేయాలో రాష్ట్ర గవర్నర్ సూచనల ను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం అంజయ్య మాట్లాడుతూ పోచంపల్లి చేనేత ఉత్పత్తులు బాగున్నాయని, అయితే మార్కెటింగ్ సరిగాలేదని, ఈ సమస్యను పరిష్కరిస్తే నేత కార్మికులు బాగుపడతారని, వ్యవసాయ రంగానికి సహకరించినట్లు గానే చేనేత రంగానికి కూడా ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. మరో పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్ మాట్లాడుతూ పోచంపల్లి గ్రామం ఇక్కత్ కు మాత్రమే ప్రసిద్ధి కాదని, ఇది నాలుగు రకాల సబ్జెక్టులతో ముడిపడి ఉందని నేత, డయింగ్, కలర్ అన్నిరకాల పరిజ్ఞానం ఉన్న కార్మికులు ఇందులో ఉన్నారని, అయితే వీరి కోసం అదనంగా ఏం చేయగలమో ఆలోచించాల్సిన అవసరం ఉందని, చేనేత కార్మికులందరికీ జియో ట్యాగింగ్ ఇవ్వాలని ,ఇక్కత్ పరిజ్ఞానాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. అంకం పాండు మాట్లాడుతూ ప్రభుత్వం నేత కార్మికుల కోసం అమలు చేస్తున్నవివిధ పథకాల వల్ల నేత కార్మికులకు ఆత్మస్థైర్యం తో పాటు, జీవన ప్రమాణాలు పెరిగాయని ,త్రిఫ్ట్ పథకం వల్ల తనాకు రెండు లక్షల 15 వేల రూపాయలు వచ్చాయని ,పిల్లల చదువుకు వినియోగించానని,అయితే నేత కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు . భారత గగన అనే నేత కార్మికు రాలు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి తాను మగ్గం నేస్తున్నానని, చిన్నప్పుడే తన భర్త చనిపోతే నలుగురు పిల్లల్ని చేనేత పైన ఆధారపడి బ్రతికించు కుంటున్నానని, ప్రభుత్వం త్రిఫ్ట్ పథకాన్ని పెట్టడం బాగుందని అయితే చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గుర్రం హేమలత మాట్లాడుతూ

తాను ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకంలో చేరి 36 నెలలు

రెండు వేల రూపాయల చొప్పున చెల్లించామని, రెండు లక్షలు వచ్చాయని, దీని ద్వారా ఇల్లు నిర్మించుకున్నని, తమకు చాలా సంతోషంగా ఉందని, మళ్ళీ తిరిగి పొదుపు చేస్తామని తెలిపారు. మరో నేత కార్మికురాలు శశికళ మాట్లాడుతూ చేనేత బీమా పథకం వల్ల చేనేత కార్మికులకు న్యాయం చేకూరుతుందని ,తన భర్తకు పక్షవాతం వస్తే







తినడానికి కూడా తిండి లేకుండేదని,ఇప్పుడు చేనేత వల్ల భరోసా వచ్చిందని, చేనేత కార్మికులందరికీ జియో ట్యాగింగ్ ఇవ్వాలని కోరారు. తడక రమేష్ మాట్లాడుతూ చేనేత కు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయడం సంతోషమని మార్కెటింగ్ రంగంలో 600 మంది పోచంపల్లి లో ఉన్నారని, వారికి కూడా జియో ట్యాగింగ్ ఇవ్వాలని, వారికి గుర్తింపు ఇవ్వాలని, నకిలీ ఇక్కత్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నకిలీ ని అరికట్టాలని, పోచంపల్లి లో యార్న్ డిపో ఏర్పాటు చేయాలని, కల్యాణలక్ష్మి పథకం కింద ప్రభుత్వం లక్ష పదివేల రూపాయలు ఇస్తున్నదని, దానితోపాటు ,ఒక పోచంపల్లి చీర ,దోతిని ఇస్తే బాగుంటుందని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఉపేందర్, భాగ్యలక్ష్మి, యాదగిరి అనే నేత కార్మికులకు నేతన్న రుణాల కింద 5 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. నేతన్న పొదుపు పథకం కింద యాదాద్రి భువనగిరి జిల్లా మొత్తానికి రెండు కోట్ల పదిహేను లక్షల 25 వేల రూపాయల చెక్కును నేత కార్మికులకు అందజేశారు. అంతకుముందు పార్కులో ఏర్పాటు చేసిన పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను రాష్ట్ర గవర్నర్ పరిశీలించడమే కాకుండా , నేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను, జీవన విధానాలను ,ఇక్కత్ ఉత్పత్తుల తయారీలో వారుఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పి ఆకాంక్ష యాదవ్ వందన సమర్పణ చేయగా, రాష్ట్ర గవర్నర్ ఓ ఎస్ డి భవాని శంకర్ ,ల్మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు ,ఇతర అధికారులు పాల్గొన్నారు .

# భారీ వర్షాలు వరదలపై అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్– ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ( ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంతవరకు ప్రాణ , ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకొంటూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి , కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో గురువారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించేదానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యలు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమీషనర్ , అగ్నిమాపక డిజీ, విపత్తుల నిర్వహణ కమీషనర్ , కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ , నీటిపారుదల, ఆర్ %ఇ% బి, ఆరోగ్య శాఖల కమీషనర్లతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని , ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని కమిటీ నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు.





ఈ ఏడాది వర్షాకాల సీజన్ అనుకున్నదానికంటే 15 రోజుల ముందుగానే వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకొని ప్రకృతి వైపరీత్యాల ప్రభావం వీలైనంతవరకు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రదేశాలలో జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో హఠాత్తుగా వచ్చే వర్షాల వల్ల ఊహించని వరదలు వస్తున్నాయని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా పరీవాహక ప్రాంతాల్లోని నివాసితులను గుర్తించి వారిని అక్కడి నుంచి శాశ్వతంగా తరలించి వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది గోదావరి పరీవాహక ప్రాంతాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం పడడం వల్ల నష్టం ఎక్కువగా జరిగిందని ఈసారి కూడా అటువంటి పరిస్థితి ఎదురైతే నష్టాన్ని తగ్గించే విధంగా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

రెవెన్యూ విపత్తుల నిర్వహణా శాఖ మూసపద్ధతికి స్వస్తి చెప్పి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అన్ని శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు . హైదరాబాద్ లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ %ఇ% కంట్రోల్ సెంటర్ కు, నిర్వహణ మరియు ముందస్తు హెచ్చరికల కోసం అవసరమైన యూజర్ ఐడీలను ఇవ్వాలని , గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆపద మిత్ర వాలంటీర్స్, %చీణ=ఖీ% (అగ్నిమాపక మరియు విపత్తు నిర్వహణ శాఖ, మరియు ప్రత్యేక పోలీస్ విభాగంలోని %ాణ=ఖీ%) సహాయంతో తో సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

వరద నియంత్రణ కట్టలు, చిన్న–మధ్య తరహా కాల్వలు, వర్షపు నీటి డ్రెయిన్లు మొదలైన వాటిని పరిశీలించి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ప్రతి మండలానికి వరద ప్రతిస్పందన ప్రణాళిక సిద్ధం చేయాలి %–% ఇందులో ఖాళీ చేయుటకు మార్గాలు, రిలీఫ్ క్యాంపుల ప్రదేశాలు, సంప్రదించవలసిన నెంబర్లు మొదలైనవి ఉండాలన్నారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, అత్యవసర మరియు పొడి ఆహార కిట్లు ముందే సిద్ధంగా ఉంచాలి.ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ మరియు ఆరోగ్య శాఖల సామాన్యంతో పనిచేయాలని కంట్రోల్ రూములు ప్రారంభించాలని అత్యధిక ప్రమాద ప్రాంతాలలో స్థానిక రేస్క్యూ బృందాలను ఏర్పాటు చేసి, వారికి ఖాళీ చేయుట, తక్షణ స్పందన చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. అత్యవసర సమయాలలో, వరద భద్రత పై తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలతో ప్రత్యక్షంగా సమావేశాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టంల ద్వారా అవగాహన కల్పించాలన్నారు.మొబైల్ వైద్య బృందాలను, అవసరమైన మందులు, నీటి శుద్ధి మాత్రలు, పారిశుద్ధ్య కిట్లు వంటివి తగిన మొత్తంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమీషనర్ హరీష్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమీషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమీషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి. గోపి. ఐఎండీ అధికారిణి నాగరత్నం, ఆదిలాబాద్ , భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల్, ములుగు, నిర్మల్, వనపర్తి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా విషాదం..

## పొలం పనులు చేస్తుండగా పిడుగు పడి 8 మంది మృతి..



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో విషాదం చోటుచేసుకుంది. గురువారం ఉదయం నుంచి ఆకాశం మబ్బులు అమ్ముకొని ఉండగా మధ్యాహ్నం సమయంలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో బేలా మండలంలోని సోన్ కాస్ గ్రామానికి చెందిన కోవా సునీత పొలం పనులు చేస్తుండగా పిడుగు పడి ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. ఈ శబ్దంతో ఉలిక్కిపడిన సునీత అక్కడికక్కడే మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అదేవిధంగా ఇదే మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన గేడం నందిని కుటుంబ సభ్యులతో కలిసి తన పొలంలో పత్తి విత్తనాలు పెడుతుండగా పిడుగు పడి పొలంలోనే మృతి చెందింది. దీంతో బేల మండలంలోని రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వేరువేరుగా జరిగిన ఈ సంఘటనతో ఆయా ప్రాంతాలకు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా ఒకేరోజు ఒకే మండలంలో ఇద్దరు మహిళలు పొలం పనులు చేస్తూ పిడుగు పడి మృతి చెందడం బాధాకరమని ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేల చూస్తామని ఆదిలాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి అన్నారు. అనంతరం మృతుల కుటుంబాలను కలిసి ఆయన పరామర్శించారు. కాగా పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.ఇది ఇలా ఉంటే గాది గూడ మండలంలోని పిప్రి గ్రామంలో నలుగురు పొలం పనులు చేస్తుండగా



పిడుగు పడటంతో మరో నలుగురు మృతి చెందారు.ఇందులో సిడాం రాంబాయి, పెందూర్ మనోహర్,పెందుర్ సంజన,బింబాయి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. గాదిగూడ మండలంలో పిడుగుపాటుతో మృతి చెందిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కాగ ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.అయితే వీరు సైతం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు చెబుతున్నారు.

# శివంపేట్ లో కాలేజీ విద్యార్థుల కోసం పాఠశాల గదులను పరిశీలించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు



శివంపేట జూన్ 12 : మెదక్ జిల్లా మండల కేంద్రమైన శివంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గదులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాలేజీ యజమాన్యం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు మండల కేంద్రమైన శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల గదులను ఆయన పరిశీలించారు శ్రీ రామ్ నగర్ ఉన్న ప్రభుత్వ పాఠశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం గదులను గదులన్నీ తిరిగి ప్రత్యేకంగా పరిశీలించి ఎంఈఓ బుచ్చా నాయక్ లను వివరాలను అడిగి తెలుసుకున్నారు జూనియర్ కళాశాల విద్యార్థులకు గదులు ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న విషయంపై ప్రత్యేకంగా పరిశీలించారు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు వెంట ఎంఈఓ బుచ్చ నాయక్. హెచ్ఎం బాలచంద్రం ఉపాధ్యాయులు చంద్రమోహన్ శత్రువు ఈశ్వర్ హేమ విజయలక్ష్మి రాదాబాయి సమత దేవకృప సలోని మాధవి పనస రెడ్డి ఉపాధ్యాయులు తో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ. పెనిల్. తోపాటు ఎమ్మార్వో కమలాద్రి తదితరులు ఉన్నారు

# నీట మునిగి నా ప్రాంతాలను పరిశీలించిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి .జగదీశ్వర్ గౌడ్



శేరిలింగంపల్లి జూన్ 12 : శేరిలింగంపల్లి నియోజకవర్గ,హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్,మదీనగూడా ప్రభుత్వ పాఠశాలలో ప్రాంతం,దత్త సాయి కాలనీలో ఈరోజు ఉదయం కురిసిన భారీ వర్షానికి నీట మునిగినా ప్రాంతాలను జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడే ,డిసి మోహన్ రెడ్డి జిహెచ్ఎంసీ ఇంజినీరింగ ఎస్సీ శంకర్ నాయక్ డిఈ శ్రీదేవి,ఏఈ ప్రతాప్,అధికారులతో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి జగదీశ్వర్ గౌడ్ ఆనంతరం చందానగర్ డివిజన్ పరిధిలోని విజేత బిల్డింగ్ సెల్లార్లో వర్షపు నీరు నిలిచిపోయిందని స్థానిక డివిజన్ నాయకులు తెలియజేయడంతో ముంపు ప్రాంతం,వరద ప్రభావిత విజేత బిల్డింగ్ సెల్లార్ ను శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు,స్థానిక చందానగర్ నాయకులతో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా సెల్లర్లలో ఉన్న వర్షపు నీటిని పంపుల ద్వారా తోడి ప్రజలకు ఇబంధులు తలెత్తకుండా త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు అలీ,నియోజకవర్గ నాయకులు మిరియాల రాఘవరావు,ఊరిటీ వెంకట్ రావు,కట్ల శేఖర్ రెడ్డి,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌందర్య రాజన్,సాయి గౌడ్,నర్సింగ్ రావు,గౌస్,హనీఫ్,నాగ మహేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# జలగం వెంగళరావు కి ఘన నివాళి



-ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగతమాజీ ముఖ్యమంత్రివర్యులు,ఉమ్మడి ఖమ్మం జిల్లాప్రజల అన్నదాత గౌరవనీయులు సర్దార్ జలగం వెంగళరావు 26వ వర్ధంతి సందర్భంగా సారపాక ప్రధాన కూడలి లో జలగం వెంగళ రావు విగ్రహానికి పూలమాలవేసి గణ నివాళులర్పించిన పినపాక నియోజకవర్గం "బి" బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లంకొండ వాసుదేవరావు,బూర్గంపహాడ్ మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్ రెడ్డి. వారు మాట్లాడుతూ..... ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కేటీపీస్, నవభారత్, ఎన్ ఎం డి సి , భద్రాచలం పేపర్ బోర్డ్స్, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ వంటి ఎన్నో సంస్థలను నిర్మించి పారిశ్రామికీకరణ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన మహనీయులు. అదేవిధంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడం కోసం ఎన్నో చెక్ డ్యాములు, కిన్నెరసాని, తాళి పేరు వంటి ప్రాజెక్టులు నిర్మించి ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఎంతో అభివృద్ధి చేసిన ఘననీయుడు సర్దార్ జలగం వెంగళరావు అని వారి యొక్క సేవలను కొనియాడినారు..

# ఫ్యాబ్రికేషన్ కార్మికులకు రావలసిన వేతనం ఇప్పించిన

## -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



కుత్బుల్లాపూర్ జూన్ 12 కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లి ఇండస్ట్రీ ఏరియాలో "ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్" లో ఓనర్ కిషోర్ దగ్గర అమరేందర్ కుమార్, డీజే, మంతోష్, ముగ్గురు కార్మికులు ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్ లో గత కొన్ని సంవత్సరల నుంచి ఫ్యాబ్రికేషన్ ఓనర్ కిషోర్ దగ్గర చేసేవారు... కొన్ని అనివార్య కారణాలవల్ల వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తూ ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేయడం జరిగింది.. మొత్తం ముగ్గురికి కలిపి రావాల్సిన వేతనం 70,000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ కిషోర్ ను ఎంత అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు అమరేందర్ కుమార్, డీజే, మంతోష్, తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి.. హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్ దగ్గరికి వెళ్లి ఓనర్ కిషోర్ తో పలుమార్లు చర్చించి కార్మికులు ముగ్గురికి కలిపి మొత్తం రావాల్సిన వేతనం, 70,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది... ఫ్యాబ్రికేషన్ కార్మికులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన రవి కి ప్రత్యేక ధన్యవాదాలు, తెలియజేశారు... ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

# బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి. జూన్ 12: : బడిబాట కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడా లో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల ప్రాథమిక పాఠశాలలో జరిగిన బడి బాట కార్యక్రమంలో గౌరవ రీజినల్ డైరెక్టర్ ఆఫ్ హైదరాబాద్ విజయలక్ష్మి %వీజూ% వెంకటయ్య తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ,స్కూల్ యూనిఫామ్ లను అందచేసిన %ూాజ% చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు గురువారం తెరచుకోనున్నాయి అని, మే నెల 9 వ తేదీన ప్రారంభమైన 'బడిబాట' కార్యక్రమం ఈ నెల 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమం కొనసాగునని , ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బడిబాట పట్టనున్నారు అని ,ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభం అయిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉంది అని,ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫారాలు అందజేస్తున్నామని. అదేవిధంగా 1 వ తరగతి నుండి 5 తరగతి వరకు విద్యార్థులకు ఉచిత వర్క్షీట్లు,పుస్తకాలు మరియు 6 వ తరగతి నుండి 10 తరగతి విద్యార్థులకు ఉచిత నోట్బుక్లు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లు పంపిణీ చేయడం జరిగిందని తెలియచేసారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో అవసరమైన మరమ్మతు పనులను దాదాపు పూర్తి చేయడం జరిగినది అని. తరగతి గదులను అలంకరించి, ప్రవేశ ద్వారాలకు మామిడి తోరణాలు కట్టి పండగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేయడం జరిగినది అని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను



అధిరోహించాలని ,తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని , సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, తన వంతు కృషి, సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయి అని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుంది అని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని సర్కారు బడులు కొత్తరూపు సంతరించుకున్నాయి అని, సకల హంగులతో సర్వాంగ సుందరంగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు, సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పన లో భాగంగా వాటి రూపురేఖలే మరినాయి అని, తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి అని దేశంలోకెల్లా అత్యధిక గురుకుల విద్యాలయాలు కలిగిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ అని పేర్కొన్నారు. విద్యతోనే వికాసం,విద్యతోనే ఆత్మవిశ్వాసం,ప్రతి తరగతి గది, తరగని విజ్ఞాన గని ఆ నాలుగుగోడలే.. దేశ భవిష్యత్తుకు మూలస్తంభాలు.ఈ సిద్ధాంతాన్ని నమ్మడమే కాదు.. అక్షరాలా ఆచరించింది అని, ,

సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనమైనా..
సర్కారు బడిలో ఇంగ్లీష్ మీడియం బోధనైనా..
ప్రతి ఆలోచన విప్లవాత్మకం..
ప్రతి నిర్ణయం ప్రతిష్ఠాత్మకం..
మన భావితరాలకు బంగారు బాటలేసే..
ఈ మహాయజ్ఞంలో మేముసైతం అంటూ...
మనసుపెట్టి పనిచేస్తున్న ఉపాధ్యాయులకు

క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సేవలు అందిస్తున్న ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను అని %ూాజ% చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజు, ఊట్ల కృష్ణ, గణేష్ ముదిరాజు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చాంద్ పాషా, తిరుపతి రెడ్డి,



తిరుపతి, బలరాం యాదవ్, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి ,గణపతి, బస్వరాజ్, రవిశంకర్, నరేష్, వినయ్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీ సీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేసిన పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి. జూన్ 12: : రూ.4 కోట్ల 51 లక్షల 50 వేల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు , %ఖ+ణ% పైప్ లైన్ నిర్మాణము పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన %ూాజ% చైర్మన్ ఆరెకపూడి గాంధీ లి గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లి తండా, ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్, ననాక్రమ్ గూడ ,జనచైతన్య కాలనీ , కాజా గూడ కుమ్మరి బస్తి, కాలనీలలో రూ. 4 కోట్ల 51 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు , %ఖ+ణ% పైప్ లైన్ నిర్మాణము పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీసీఏ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం 4 కోట్ల 51 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు , %ఖ+ణ% పైప్ లైన్ నిర్మాణము పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని %ూాజ% చైర్మన్ గాంధీ పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, శేరిలింగంపల్లి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా



తీర్చిదిద్దుతానని భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మరియు మా కార్పొరేటర్లు, మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో ఈ రోజు జనచైతన్య కాలనీ,కాజా గూడా కుమ్మరి బస్తి, ననాక్రమ్ గూడ శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని

ప్రతి కాలనీ కి స్వచ్చమైన మంచినీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని

శంకుస్థాపన చేసిన కార్యక్రమాల వివరాలు :

మంజూరైన అభివృధి పనుల వివరాలు

1.గోపన్ పల్లి తండా లో రూ.90.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీ సీ రోడ్ల నిర్మాణం పనులకులి

2.గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ లో రూ.78.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీ సీ రోడ్ల నిర్మాణం పనులకులి

3.గోపన్ పల్లి తాజ్ నగర్ లో రూ.73.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీ సీ రోడ్ల నిర్మాణం పనులకులి

4.కాజా గూడ కుమ్మరి బస్తి లో రూ.45.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజి



(%ఖ+ణ%) నిర్మాణం పనులకు. 5.జనచైతన్య కాలనీ లో రూ.85.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజి (%ఖ+ణ%) నిర్మాణం పనులకు 6.జనచైతన్య కాలనీ మరియు ననాక్రమ్ గూడ లో రూ.80.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు. పైన పేర్కొన్న సీసీరోడ్ల నిర్మాణం పనులకు అండర్ గ్రౌండ్ డ్రైనేజి, మంచి నీటి నిర్మాణము పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని %ూాజ% చైర్మన్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నాడు గూడూరు లో శ్రీ సాయిబాబా దత్తాత్రేయ స్వామి వారి దేవాలయం నిర్మించాలన్న కోరిక నేడు నెరవేరింది..

## గూడూరు లో శ్రీ గురు పీఠం ట్రస్ట్ చైర్మన్ జిన్నారం శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా హెూమాలు పూజలు..

## హైకోర్టు న్యాయవాది జిన్నారం శివకుమార్ గౌడ్

శివంపేట జూన్ 12 : నాడు గూడూరులో శ్రీ సాయిబాబా శ్రీ దత్తాత్రేయ స్వామి వారి దేవాలయం



నిర్మించాలన్న కోరిక నేడు నెరవేరిందని శ్రీ గురు పీఠం ట్రస్ట్ చైర్మన్ హైకోర్టు న్యాయవాది జిన్నారం శివకుమార్ గౌడ్ అన్నారు మెదక్ జిల్లా శివంపేట మండలంలోని గూడూరు గ్రామంలో వెలసిన శ్రీ గురు పీఠం ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామి. శ్రీ సాయినాథ్ దేవాలయంలో హెూమాలు అర్చనలు. ప్రధాన పూజారి వంశీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నాడు నిర్వహించారు. గూడూరు గ్రామానికి చెందిన కావేటి యాదగిరి యాదవ్ దంపతుల కూడా హెూమాలు పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషికి ప్రశాంతత ఎంతో అవసరమని ప్రతివారికి మానసిక ప్రశాంతత తోనే ఎంతగానో ఆరోగ్యం కుదువ పడుతుందని ఆయన అన్నారు 45 సంవత్సరాల క్రితం గూడూరు గ్రామంలో సిరి దత్తాత్రేయ స్వామి శ్రీ సాయినాధుల దేవాలయాలు నిర్మించాలన్న కోరిక వారి ఆశీర్వాదంతోనే నెరవేరిందని ఆయన చెప్పారు. స్వామి వారి



ఆశీస్సులు అందరిపై చల్లగా ఉండాలని ఆయన స్వామివారిని దర్శించుకుని పూజలు చేసిన అనంతరం స్వామి వారిని వేడుకున్నారు స్వామి వారి ఆశీస్సులు తనపై ఉండాలని ఆయన స్వామివారిని వేడుకున్నారు. తన సొంత ఖర్చులతో హైకోర్టు న్యాయవాది జిన్నారం శివకుమార్ గౌడ్ వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు పీఠం ట్రస్టు సభ్యులు రాజ్యం బిక్షపతి యాదవ్ న్యాయవాది వి హనుమంతు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ఆయిల్ ఫామ్ సాగులో మెదక్ జిల్లా ఆదర్శంగా నిలవాలి..

## ఆయిల్ ఫామ్ సాగులో కోసం రైతులు ముందుకు రావాలి. రైతుల అభివృద్ధి రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం రాయితీలు రైతులు ఉపయోగించుకోవాలి..



శివంపేట జూన్ 12: ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతులు ముందుకు రావాల్సిన అవసరం ఉన్నదని రైతుల అభివృద్ధి కోసమే ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు రాయితీలు కల్పించిందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు అన్నారు మెదక్ జిల్లా శివంపేట మండలంలోని రత్నాపూర్ సమీపంలో ఉన్న సీతారాం తండా గ్రామపంచాయతీలో అదే తాండ మాజీ సర్పంచ్ బానోత్ సోనీ బానోత్ రవి నాయకులు వారి చెందిన ఏడున్నర ఎకరాల భూమిలో 428 మొక్కలు నాటే కార్యక్రమాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు ప్రారంభించారు మొక్కల నాటి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు నాలుగు సంవత్సరాలకు ఎకరానికి లక్షణారాధయం ఆయిల్ ఫామ్ సాగుకు వస్తుందని ఆయన చెప్పారు నాలుగో సంవత్సరానికి భారీగా ఆదాయం రైతులకు వస్తుందని ఆయన చెప్పారు రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు రావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు చెప్పారు ప్రభుత్వము రైతులను రైతులను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉన్నది అని కూడా ఈ సందర్భంగా ఆయన చెప్పారు భూమి సారవంతం అయితేనే ఆదాయం ఎక్కువగా ఉంటుందని కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు ప్రభుత్వము పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ మొక్కలతో పాటు డ్రిప్పు సిస్టం పద్ధతిని ద్వారా రైతులు లాభాలు పొందాలని మెదక్ జిల్లా కలెక్టర్ సూచించారు ఆయిల్ ఫామ్ సాగు తోటలకు ఇతర జంతువుల నుండి ఎలాంటి బెరద లేదని కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు రైతులు ఆర్థికంగా లాభాలు అభివృద్ధి వైపు పయనించవలసిన సమయము వచ్చిందని



రైతులకు ఆయన సూచించారు ఆయిల్ ఫామ్ సాగులో మెదక్ జిల్లాను ఆదర్శంగా నిలవాలని రైతులకు ఆయన పిలుపునిచ్చారు మండల పత్రిక అధికారి ప్రతాప్ సింగ్ నరసాపూర్ ఆర్టీవో మైపాల్ రెడ్డి తాసిల్దార్ కమలాద్రి ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా. ఏపీవో అనిల్ కుమార్ ఏవో లావణ్య. రైతులు బానోత్ రవి నాయక్. బానోత్ సోనీ నాయక్ రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు



ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
https://www.facebook.com/prabhathasuryudu
శుక్రవారం - 13 - జూన్ - 2025

## నర్సాపూర్ తాలూకా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కమల పూల్ సింగ్ నియామకమైన సందర్భంగా శాలువలతో ఘనంగా సన్మానించిన మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుపతి రాథోడ్



శివంపేట జూన్ 12 : మెదక్ జిల్లా నర్సాపూర్ తాలూకా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా మాజీ జడ్పిటిసి కమల పోసింగ్ నియామకం పట్ల ఆమెను మర్యాదపూర్వకంగా కల్సుకొని మీ అమ్మకమైన సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించిన శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు తిరుపతి రాథోడ్ రమేష్ నాయక్ పోల్ సింగ్ మాన్సింగ్ నాయకులు తదితరులు ఉన్నారు

## విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పై స్థాయికి ఎదగాలి ఎంఈఓ బుచ్చ నాయక్



శివంపేట జూన్ 12 : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని పై స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉన్నదని మండల విద్యాధికారి బుచ్చ నాయక్ అన్నారు శివంపేట మండలంలోని గోమారం గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బడిబాట లో కార్యక్రమంలో భాగంగా సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ అందజేస్తుందని వారు అన్నారు ప్రభుత్వ పాఠశాలలోని అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని కూడా ఈ సందర్భంగ గుర్తు చేశారు విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తేవాల్సిన అవసరం ఉన్నదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు ఈ సమావేశంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు

## పీర్జాదిగూడలో అక్రమ నిర్మాణాల అడ్డాగా మారింది
### తీసుకునే పర్మిషన్ ఒకటి..నిర్మించే నిర్మాణం మరొకటి..
### అధికారుల నిర్లక్ష్యంతో మున్సిపల్ ఆదాయానికి బారిగండి




జూన్ 12, : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ పరిధిలో కేఎల్ఎం రోడ్లో ఏవి చందన హైట్స్ ఎదురుగా జి ప్లస్ టు పర్మిషన్ తీసుకొని, మూడంతస్తులు నిర్మించి దానిపై పెంట్ హౌస్ ను ఏదేచ్ఛగా నిర్మిస్తున్నారు. సామాన్యుల ఇండ్లపై ప్రతాపం చూపే అధికారులకు ఇది కనిపించడం లేదా? కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వల్ల లక్షలాది రూపాయల మున్సిపల్ ఆదాయానికి గండిపడుతుందని,టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వల్లనే,అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుందని స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం

మెదక్/వెల్దుర్తి : మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం లో మానేపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు మరియు వెల్దుర్తి ఎక్స్ ఎంపీపీ నరేందర్ రెడ్డి వైస్ ఎంపీపీ సుధాకర్ తెలంగాణ రాష్ట్ర ఫిషర్ మెన్ కార్యదర్శి తలారి మల్లేశం వెల్దుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మంగళపర్తి మాజీ సర్పంచ్ బాలయ్య గారి రామకృష్ణ ఎండి షఫీ ఎక్స్ ఎంపిటిసి అడవయ్య గొల్ల శ్రీనివాస్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు






గ్రామాల వారిగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల సంఖ్య మంగళపర్తి గ్రామానికి 15 మానేపల్లి గ్రామపంచాయతీకి 30 శెట్టిపల్లి 15 రామయపల్లి 15 ఎలక పల్లి 9 ఆరెగూడెం 9 బస్వాపూర్ 9 గ్రామాల్లో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు

## వర్షపు నీరు బయటకు తరలించడానికి ప్రత్యేక పైప్లైన్ ఏర్పాటు



( అరుణ ప్రభ) : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ని హైదరాబాద్ రోడ్డు విద్యానగర్ కాలనీలో వర్షాకాలంలో వర్షం రావడం వలన వరద నీరు భారీగా చేరి విద్యానగర్ కాలనీవాసులకు ఇబ్బందికరంగా మారడం జరిగింది . దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత ఉన్నత అధికారులకు విన్నవించుకోవడం వలన ఈ వర్షపు నీరు వల్ల కాలనీవాసులు ఇబ్బంది పడకుండా పంచాయతీరాజ్ ఏఈ ఇందిరా గారు దగ్గర ఉండి పనులను పర్యవేక్షించడం జరిగింది. అలాగే ఈ వర్షపు నీరు బయటకు తరలించడానికి ప్రత్యేక పైప్లైన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇన్ని రోజులుగా కాలనీవాసులు వరదనీటితో ఇబ్బంది పడుతున్నామని మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి గారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది . అలాగే ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులు రాజకీయ నాయకులు ప్రముఖులు చొరవ తీసుకోవడం వలన ఈరోజు పైప్లైన్ పనులు ప్రారంభించడం జరిగింది. అందుకు కాలనీవాసులు ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా పంచాయతీరాజ్ ఏఈ గారికి,మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి గార్లకు గారికి కృతజ్ఞతలు తెలియపరిచారు.

## దిండి గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహణ.



దిండి ,జూన్ 12,రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్ లోని దిండి మండలంలో గురువారం రెవిన్యూ సదస్సులు కొనసాగాయి. డిండి మండల కేంద్రం తో సహా కామేపల్లి గ్రామంలో గురువారము రెవిన్యూ సదస్సులు నిర్వహించబడ్డాయి .దిండి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించబడిన రెవెన్యూ సదస్సులో డిండి గ్రామానికి సంబంధించిన రైతులు గతంలో ఇరిగేషన్ శాఖ పేరున నమోదు అయిన రైతుల భూములను ,హైకోర్టు ఉత్తర్వుల ప్రకారము తిరిగి రైతుల పేరున బదలాయించాలని డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సరోజ కు దరఖాస్తు తో పాటు హైకోర్టు ఉత్తర్వులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆలంపల్లి లక్ష్మీనారాయణ, గుర్రం రాములు, లక్ష్మీనరసింహ, వంగాల రఘుమారెడ్డి, శేఖర్ రెడ్డి, వావిళ్ల సలయ్య, పొలం లక్ష్మణ్ ,నల్లగంతుల రవి, వెంకటయ్య, తుమ్మల కృష్ణారెడ్డి, గుర్రం సురేష్, శ్రీనివాస్ రెడ్డి ,తదితర రైతులతో పాటు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి జూన్ 12 : నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ముంపు ప్రాంతలలో కలిగే సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతల్లో పర్యటించి, పరిశీలించి, సహాయక చర్యల్లో పాల్గొన్న %ూూజ% చైర్మన్ ఆరెకపూడి గాంధీ లిప్రజలు అందరు వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని అప్రమాత్రంగా ఉండలని, అత్యవసర పరిస్థితి తప్ప ఇంటి నుండి బయటకు రావొద్దు అని,ప్రతి ఒక్కరు కనీస స్వీయ రక్షణ చర్యలు పాటించాలని పిలుపునిచ్చిన %ూూజ% చైర్మన్ ఆరెకపూడి గాంధీ నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం నేపథ్యంలో చందానగర్ డివిజన్ పరిధిలోని చందానగర్ లోని ముంపు ప్రాంతలలో కలిగే సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి పరిశీలించిన %ూూజ% చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నిన్న రాత్రి కురిసిన 15 సెంటిమీటర్ల భారీ వర్షం కారణంగా శేరిలింగంపల్లి లోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఎటువంటి సమస్య తలెత్తలేదు అని, ఎన్నో ఏండ్ల సమస్య తిరినది అని, ఇటీవల నిర్మించిన వరద నీటి కాల్వ నిర్మాణం మరియు నాల విస్తరణ పనుల వలన నీరు నిల్వ లేకుండా సాఫీగా సాగినది అని ,నాల విస్తరణ మరియు వరద నీటి కాల్వ నిర్మాణం విజయవంతం అయినది అని చాలా సంతోషకరమైన విషయం అని, ప్రజలకు, ప్రయాణికులకు సాంత్వన చేకూరింది అని, శుభపరిణామం అని %ూూజ% చైర్మన్ అన్నారు. చందానగర్ లో నూతనంగా నిర్మించిన %దీఎజూ% ఫ్లై ఓవర్ పై నుండి వచ్చిన నీరు సెల్లార్ లోకి వెళ్లడం జరిగినది అని, సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని %=ఓ దీ% అధికారులను మరియు %+ఎవీజ% అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగినది అని ,పలు సలహాలు ,సూచనలు ఇవ్వడం జరిగింది.మళ్ళీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, సెల్లార్ల లోని నీటిని త్వరితగతిన తీసివేయలని తెలియచేసారు. 15 సెంటిమీటర్ల వర్షం కురిసిన శేరిలింగంపల్లి లో ఎక్కడ పెద్దగా ఇబ్బంది కలగకుండా నీటి ప్రవాహం సాఫీగా సాగేలా గతంలో తీసుకున్న నిర్ణయాలు మరియు నాలల




విస్తరణ పనులు ఎంతగానో తోడ్పడినయి అని అక్కడక్కడా చిన్న చిన్న సమస్యలు ఏర్పడిన వాటి ని తక్షణమే పరిష్కరించడం జరిగినది అని , మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పిస్తామని తెలియచేసారు. వర్షాకాలం లో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమాత్రంగా ఉండలని,వాతావరణ శాఖ సూచన ల మెరకు అప్రమత్రంగా ఉండలని, భారీ వర్షాల కారణంగా, ప్రజలు, ప్రతి కాలనీ వాసులు, తమ ఇండ్ల నుంచి ఎవరు బయటకి రావొద్దు అని, అత్యవసరం తప్పితే ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని , ఎటువంటి ఇబ్బందులు కలిగిన,(ఎలక్ట్రికల్,రోడ్డు,డ్రైనేజీ ,మంచి నీటి) వంటి సమస్య లు ఎదురైన , వెంటనే సంబంధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించవల్సిందిగా మనవి అని . అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని , %+ఎవీజ% అధికారులు మరియు మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండలని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడలని , ప్రజలు అభద్రత కు లోను కాకుండా ధైర్యంగా ఉండలని, వర్షాలు పడుతున్న సమయంలో ఇంటి నుండి బయటకి రాకుండా ఉండలని తప్పని పరిస్థితుల్లో బయటకి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు ,నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని,అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిత్యం ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ,ఎక్కడ ఏ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చూడాలని అధికారులకు తెలియచేసారు,అధికారులకు పలు సలహాలు,సూచనలు ఇవ్వడం జరిగినది. నిత్యం అందుబాటులో ఉంటానని ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి గాని ,మా కార్యాలయం దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, అదేవిధంగా వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని భారీ వర్షాల నేపథ్యంలో %+ఎవీజ% ఇంజనీరింగ్ మరియు మాన్ సూన్ ఎమర్జెన్సీ




టీమ్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమాత్రంగా ఉండలని,ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో ఉండలని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,నరేందర్ బల్లా మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు

# జనంసాక్షి ఎడిటర్ పై కేసు ఎత్తివేయాలి

### అదనపు డీజిపి, ఐజీలకు టీయుడబ్ల్యూజే వినతి

జోగులాంబ గద్వాల జిల్లా, : పెద్దధన్వాడ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ దుష్ప్రభావాలపై వరస కథనాలను ప్రచురించిన జనంసాక్షి పత్రిక ఎడిటర్ ఎం.ఎం.రహమాన్ పై రాజోలీ పోలీసులు నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించు కోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. గురువారం నాడు టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం, అదనపు డీజీపి (శాంతి భద్రతలు) మహేష్ భగవత్, మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణలను కలిసి వినతి పత్రాలు అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, జనంసాక్షి పత్రిక ఎడిటర్ రహమాన్ గద్వాల జిల్లాకు చెందడంతో ఆ ప్రాంతంతో ఆయనకు అనుబంధం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత ఎనిమిది నెలలుగా ఆ ప్రాంత రైతులు చేస్తున్న పోరాటాల్ని జనంసాక్షి పత్రిక వరుస కథనాలు రాసిందని ఆయన తెలిపారు. పెద్దధన్వాడలో రైతులు ఆందోళన చేసిన రోజు




అనగా జూన్ 4న, రహమాన్ హైదరాబాద్లోనే ఉన్నాడని, ఆ రోజు ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఓ పరీక్షా కేంద్రంలో హిస్టరీ సబ్జెక్టు పరీక్షను కూడా రాశాడని విరాహత్ పేర్కొంటూ.. హాల్ టిక్కెట్ ను సాక్ష్యంగా చూపించారు. అంతేకాకుండా గతంలో పెద్దధన్వాడలో జరిగిన ప్రత్యక్ష ఆందోళనలలో ఏనాడూ రహమాన్ పాల్గొనలేదన్నారు. కేవలం అక్కడి రైతులు చేసిన ఆందోళనలకు సంబంధించి జనంసాక్షి పత్రిక నిత్యం కథనాలను ప్రచురించిందని, దీనిపై అక్కసు పెంచుకున్న ఫ్యాక్టరీ యాజమాన్యం, ఎడిటర్ రహమాన్ను ప్రధాన నిందితుల జాబితాలో చేర్చడం భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టులాంటిదిగా భావిస్తున్నామన్నారు. ఉద్దేశపూర్వకంగా ఫ్యాక్టరీ యాజమాన్యం ఏ2 నిందితుడిగా రహమాన్ను చేర్చడం విచారకరమన్నారు. జనంసాక్షి ఎడిటర్పై నమోద్కైన 30 సెక్షన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి విచారణ జరపకుండా జనంసాక్షి ఎడిటర్పై అక్రమంగా కేసులు నమోదు చేసిన రాజోలి ఎస్సై జగదీశ్పై చర్యలు తీసుకోవాలని విరాహత్ అలీ డిమాండ్ చేసారు. పోలీసు ఉన్నతాధికారులను కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాజేశ్వరి, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ లు ఉన్నారు.

విచారణకు ఆదేశాలు

టీయూడబ్ల్యూజే సమర్పించిన వినతిపత్రంపై అదనపు డీజిపి మహేష్ భగవత్, ఐజీ వి. సత్యనారాయణలు స్పందించారు. వెంటనే విచారణ జరిపించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# విద్యార్థుల భవిత ఉన్నతంగా తీర్చిదిద్దాలి

### కాస్మటిక్ చార్జీలు నేరుగా విద్యార్థుల అకౌంట్ లోకి
### విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం, వసతి అందించాలి
### ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, హెల్త్ ప్రొఫైల్ తయారుచేయాలి
### నాలుగు నెలల అద్దె బాకాయిలు విడుదల
### బీసీ సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



: విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, వసతి సదుపాయాలు కల్పించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు సూచించారు. 2025-26 విద్యాసంవత్సరం బుధవారం నుంచి పునఃప్రారంభం కావడంతో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాల విద్యను అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో, విద్యాబోధనలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డన్స్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని మంత్రి గారు పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ విద్యార్థుల భవితవ్యం కోసం శాయశక్తుల కృషి చేయాలన్నారు. రాష్ట్రం, దేశం గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. రేపటి భవిష్యత్ నేటి విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, బీసీ సంక్షేమ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగునెలల అద్దె బకాయిలు విడుదల చేసింది. భవనాల యజమానులతో సంప్రదించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాలలో, హాస్టల్ లో పరిశుభ్రత పాటించాలని, దోమల నుంచి రక్షణ కోసం నెట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, వసతి సామాగ్రి వెంటనే అందించాలని మంత్రి సూచించారు. రాష్ట్ర స్థాయి అధికారులు నెలవారీ రిపోర్ట్స్ తెప్పించుకోవాలని, ప్రయత్న లోపాలు లేకుండా విద్యార్థులకు విద్య, వసతులు అందించాలన్నారు. ప్రభుత్వ పరంగా మౌలికసదుపాయాలు కల్పనలో ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు విద్యార్థులకు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో, హాస్టల్ లో ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధింత ప్రిన్సిపాల్, వార్డెన్ ల దృష్టికి తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాకపోతే జిల్లా స్థాయిలో ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసకోవాలని ఆయన అన్నారు. సరైన సదుపాయాలు లేని పాఠశాలను గుర్తించి వాటిని చక్కదిద్దే ప్రయత్నం చేయాలి. కిచెన్, వాటర్ ట్యాంక్ లు, మరుగుదొడ్డులు, బాత్ రూంలు, పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారం తొలగించాలి. వసతి సదుపాయాలు సమగ్రంగా అందేలా చూడాలి.

ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు వారి కాస్మటిక్ చార్జీలు నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఇందుకు సంబంధించి విద్యార్థులందరికీ బ్యాంక్ అకౌంట్ ఏర్పాటు చేయడం జరిగింది. విద్యబోధనలో నాణ్యమైన ప్రమాణాలు పాటించాలి. ప్రతి విద్యార్థికి అన్ని సదుపాయాలు అందించి సంస్థ గర్వపడేలా వారి ఉన్నతి ఉండాలి. అన్ని విషయాలను కూలంకుషంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి నెలవారి ఆరోగ్య పట్టికను సిద్ధం చేయాలి. ప్రతినెలా ఎత్తు, బరువు నమోదు చేయాలి. అకడమిక్ వ్యవస్థను పటిష్టం చేయాలి. నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేయాలి. రాష్ట్రస్థాయిలో పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో బీసీ విద్యాసంస్థలు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఫస్ట్ ప్లేస్ లో ఉండాలి. ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్ లో అకడమిక్ ప్రొఫైల్ తయారు చేయాలి. పదోతరగతి విద్యార్థి 8,9 తరగతల్లో వారి సబ్జెక్ వారి మార్కులు పరిగణనలోకి తీసుకుని, ఏ సబ్జెక్ లోనైనా వెనుకబడి ఉంటే ఆ సబ్జెక్ లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మంచి ఫలితాలు సాధిచడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతినెలా ఆర్ సి వోలు, డిబిసిడివో లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఎంజెపి సెక్రటరీ బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీ లు తిరుపతి, మద్దిలేటి, ఎంబిసి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సిఇవో అలోక్ కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెడి ఇందిర తదితర ఉన్నతాధికారులు, ఆర్ సి వోలు, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డన్లు పాల్గొన్నారు.

# దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెడతాం

### రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరిక
### చెంగిచెర్ల దేవుడి మాన్యాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి సురేఖ
### ఎండోమెంటు ల్యాండ్లకి ఫెన్సింగ్ వేయించి పరిరక్షించాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్ : రాష్ట్రంలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిని కబ్జా చేసేవారిపై పీడీ యాక్టులు పెడతామని, అసలు దేవాదాయ శాఖకు చెందిన భూములు కబ్జా కాకుండా చూస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దేవుడి భూములు పరిరక్షించడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి దేవుడి భూములు కాపాడుతున్నట్లు సురేఖ వివరించారు. గురువారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఫిర్యాదు మేరకు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 33/8 లో 10.33 ఎకరాలు, సర్వే నెంబరు 33/9 లో 13 ఎకరాలు, సర్వే నెంబరు 33/10 లో 6.33 ఎకరాల చొప్పున మొత్తం 30.28 ఎకరాల భూమిని 1968 లో టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ కు భూ పట్టదారులైన తోటకూర ఎల్లయ్య యాదవ్, రామయ్య చౌదరి తదితరుల ద్వారా... సీలింగ్ యాక్ట్ నిబంధనల మేరకు సదరు భూమిని 1976 సంవత్సరంలో దేవాదాయ శాఖకు అప్పగించారని తెలిపారు. అప్పటి నుంచి ఈ భూమి దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ భూమిని కాపాడుతూ వచ్చాయన్నారు. అయితే, ఈ భూములను కబ్జా చేసేందుకు కొంతమంది పని చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. దేవాదాయ శాఖ భూములు కబ్జాకు పాల్పడిందే ఎవరైనా సరే వదిలే ప్రసక్తే లేదని మంత్రి సురేఖ హెచ్చరించారు. అయినా, భూములను స్వాధీనం చేసుకొని కబ్జా దారులపై పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు. మంత్రి వెంట పర్యటించిన వారిలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మేడిపల్లి తహసీల్దారు హసీనా, దేవాదాయ శాఖ సర్వేయర్లు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఈ భూములు పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. చెంగిచెర్ల భూములు, 1976లో టీఎల్పీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దేవాదాయ శాఖకు దక్కాయని గుర్తు చేశారు. అయితే, వీటిని కొంతమంది ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేసి విల్లాల నిర్మాణాలు చేపడుతున్నట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మార్వోతో కలసి కొంతమంది నకిలీ సర్వే చేయించి అక్రమంగా సొంతం చేసుకునే ప్రయత్నం చేసినట్టు వివరించారు. కాగా, తాజాగా ఏడీ సర్వే చేయించగా ఈ భూములన్నీ దేవాదాయ శాఖకు చెందిన భూములుగా తేలినట్టు మంత్రి సురేఖ చెప్పుకొచ్చారు. అయితే, ఈ కబ్జా అంశం, మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, జంగయ్య యాదవ్... వరంగల్ వెళ్తున్న మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి కొండా సురేఖ వెనువెంటనే రెవెన్యూ, దేవాదాయ, పోలీసు అధికారులను పిలిపించి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్తోనూ ఫోన్లో మాట్లాడారు. దేవాదాయ శాఖకి చెందిన ఈ 30 ఎకరాల భూములను రక్షించి బార్ కోడ్ చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### గత ప్రభుత్వంలో దేవుడి భూములపై నిర్లక్ష్యం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవుడి భూములపై నిర్లక్ష్యం కొనసాగింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ఆలయ భూములపై ఫోకస్ పెట్టింది. ఎక్కడెక్కడ భూములున్నాయో... ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయో... అన్యాక్రాంతమైన జాగలెన్నో... అనే లెక్కలు తీశారు. రాష్ట్రంలో వివిధ ఆలయాల పరిధిలో మొత్తం 91,827 ఎకరాలున్నట్టు ఎండోమెంట్ గుర్తించింది. అందులో 25 వేల ఎకరాలు కబ్జా అయినట్టు నిర్ధారించింది. మరో 6 వేల ఎకరాలు ఇతర రాష్ట్రాల పరిధిలో ఉన్నట్టు తేలిందని దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

## శక్తి వంచన లేకుండా ప్రతిరోజూ పని చేస్తున్నాం



అమరావతి: రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో గురువారంతో ఏడాది పూర్తి చేసుకుందని..ప్రజల ఆకాంక్షలను తీర్చడం కోసం శక్తి వంచన లేకుండా ప్రతిరోజూ పని చేస్తున్నామనిముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "అనేక సమస్యలు, ఆర్థిక సవాళ్లను దాటుకుంటూ ముందుకెళ్తున్నాం. ఏడాది కాలంలోనే పేదల సేవలో, పింఛన్లు, అన్న క్యాంటీన్లు, దీపం-2, తల్లికి వందనం, మత్స్యకార సేవలో.. లాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చాం. మెగా డీఎస్సీతో టీచర్ ఉద్యోగాలు ఇవ్వనున్నాం. పెట్టుబడులతో ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పనకు అడుగులు వేశాం. 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సహా రైతు సంక్షేమానికి పలు నిర్ణయాలు తీసుకున్నాం. ఈ నెలలోనే 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు ఆర్థిక సాయం అందిస్తాం. ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే కార్యక్రమం చేపట్టాం. రాజధాని నిర్మాణం, పోలవరం పనులను మళ్లీ గాడిన పెట్టాం. రైల్వే జోన్ సాధించాం. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాం. మీ ఆశీర్వాద బలంతో రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను. ఏడాది పాలనను విజయవంతం చేయడానికి సహకరించిన, పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను. సుపరిపాలనలో తొలి అడుగు ప్రజల్లో నమ్మకాన్ని, భరోసాను కలిగించింది.. మలి అడుగు మరింత సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## భారత్‌తో దోస్తీకి ఇదే మంచి సమయం..



**న్యూఢిల్లీ,:** ఆర్థిక రంగంలో పరుగులు పెడుతున్న భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని కెనడా ప్రభుత్వం వెల్లడించింది. అధిక పన్నులు విధించి విసిగిస్తున్న అమెరికాతో.. వాణిజ్య సంబంధాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో.. భారత్‌తో చర్చలు జరపాల్సిన అవసరాన్ని గురించి తెలియజేశారు. వచ్చేవారం అల్బెర్టా వేదికగా జరగనున్న జీ7 సమ్మిట్ కు భారత ప్రధాని మోడీని ఆహ్వానించడంపై అక్కడి ప్రతిపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో కెనడా సర్కార్ ఈ మేరకు రియాక్ట్ అయింది. ఆర్థిక ప్రాధాన్యతలపై చర్చించడానికి జీ7 సమావేశం కీలకమైన వేదిక అని కెనడా అంతర్జాతీయ వాణిజ్యశాఖ మంత్రి మనీందర్ సిద్ధూ కామెంట్స్ చేశారు. అయితే, కెనడా ఆర్థిక ప్రాధాన్యతలపై చర్చించడానికే జీ7 సమావేశం ముఖ్యమైన వేదిక.. పరస్పర ఆర్థిక సహకారం, జాతి భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ఇక్కడ అవకాశం ఉంటుంది అని కెనడా మంత్రి మనీందర్ చెప్పుకొచ్చారు. కొందరి నాయకులను ఆహ్వానించడంపై స్థానిక నేతల నుంచి విమర్శలు రావడం మంచిది కాదు.. కానీ, ఈ ఆర్థిక సంక్షోభ సమయంలో దేశాలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. మన సమస్యలను పరిష్కరించుకోవడానికి భారత్ మనకు ముందున్న ఒక అవకాశం అని ఆయన తెలిపారు. జీ7 సదస్సులో ప్రధానంగా జాతి భద్రత, విదేశీ జోక్యం అంశాలపై చర్చించబోతున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఇప్పటికే స్పష్టం చేశారు.. పరస్పర ఆర్థిక సహకారం పైనా ఈ సదస్సులో చర్చించబోతున్నట్లు మనీందర్ సిద్ధూ పేర్కొన్నారు. ఇక, కెనడా గడ్డపై హింసకు తావులేదని మనీందర్ సిద్ధూ తేల్చి చెప్పారు. భారత్‌తో దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి.. ఫేస్ టూ ఫేస్ మాట్లాడాలన్నా జీ7 సదస్సు ఓ చక్కని వేదికని వెల్లడించారు. జస్టిన్ ట్రూడో అధికారంలో ఉన్నప్పుడు ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందని ఆయన ఆరోపించడంతో.. భారత్, కెనడాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయని గుర్తు చేశారు. దీంతో క్రమంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా బలహీనపడ్డాయి.

## అడిగిన వారికి 'కులం లేదు, మతం లేదు' సర్టిఫికెట్లు ఇవ్వండి..



**న్యూఢిల్లీ,:** భారత రాజ్యాంగం కుల వివక్షను నిషేధించినప్పటికీ, రిజర్వేషన్ విధానాల ద్వారా సామాజిక జీవితం, రాజకీయాలు, విద్య, ఉపాధిలో కులం, మతం ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే, తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరు జిల్లాకు చెందిన హెచ్ సంతోష్ తన కుటుంబానికి 'కులం లేదు, మతం లేదు' సర్టిఫికెట్లు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. అలాంటి సర్టిఫికెట్లు జారీ చేయడం కుదరదు అనిని స్థానిక తహశీల్దార్ తేల్చి చెప్పడంతో మద్రాస్ హైకోర్టులో అతడు పిటిషన్ దాఖలు చేశాడు. కులం, మతపరమైన గుర్తింపు లేని సమాజంలో తన పిల్లలను పెంచాలనే కోరికను ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. విచారణ తర్వాత పిటిషనర్ సంతోష్ కి ఊరట కల్పిస్తూ.. తమిళనాడు ప్రభుత్వానికి కీలక ఉత్తర్వులు జారీ చేసింది మద్రాస్ హైకోర్టు. ఇక, మద్రాస్ హైకోర్టులోని జస్టిస్ ఎంఎస్ రమేష్, జస్టిస్ ఎన్ సెంథిల్ కుమార్ లతో కూడిన డివిజన్ బెంచ్.. తిరుపత్తూరు జిల్లా కలెక్టర్, సంబంధిత తహశీల్దార్లను నెలలోపు పిటిషనర్ కు సర్టిఫికెట్ జారీ చేయాలని ఆదేశించింది. అలాగే, రెవెన్యూ శాఖను సంప్రదించే అర్హత కలిగిన దరఖాస్తుదారులందరికీ అటువంటి ధృవపత్రాలను జారీ చేయడానికి వీలుగా ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలని తమిళనాడు సర్కార్ ను న్యాయస్థానం కోరింది. అయితే, భారత రాజ్యాంగం కుల వివక్షను నిషేధించిన, రిజర్వేషన్ల ద్వారా సామాజిక, రాజకీయాలు, విద్య, ఉపాధిలో కులం, మతం ఇప్పటికీ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని ధర్మాసనం వెల్లడించింది. ఇక, కుల- మతపరమైన గుర్తింపును త్యజించాలన్న పిటిషనర్ నిర్ణయాన్ని న్యాయమూర్తులు ప్రశంసనీయం అన్నారు.

## పాక్ కి భారత్ మరో షాక్..
## ఆ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపుకు ప్లాన్..

పాకిస్తాన్ కు భారత్ మరో షాక్ ఇచ్చింది. జమ్మూ కాశ్మీర్‌లోని హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై మోడీ సర్కార్ ప్రణాళికలు రెడీ చేస్తోందని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వెల్లడించారు. అయితే, ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాక్‌తో ఉన్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. ఇక, సింధు, దాని ఉప నదులపై భారత్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్ల నిర్మాణం కష్టంగా మారడంతో.. పాటు నీటి నిల్వ సామర్థ్యం పెంచడం కూడా సమస్యగా ఉండేది. కానీ, ఇప్పుడు దాయాది దేశంతో ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. కొత్త ప్రాజెక్టులతో పాటు నీటి నిల్వను కూడా పెంచే ఛాన్స్ దొరికింది. అయితే, నిర్మాణ ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టుల్లో ఇప్పుడు ఎటువంటి మార్పులు చేయడం లేదన్నారు. ఎందుకంటే వీటికి సంబంధించిన సాంకేతిక అంశాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. మరికొన్ని ప్రాజెక్టులు ప్రారంభ దశలోనే ఉండటంతో.. వాటిల్లో విద్యుత్ ఉత్పత్తిని ఎక్కువగా చేసేందుకు నీటి నిల్వ సామర్థ్యం పెంచడానికి ప్లాన్ చేస్తున్నామని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చెప్పుకొచ్చారు. అయితే, ప్రస్తుతం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ జమ్మూ కాశ్మీర్‌లో నాలుగు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల ఏర్పాటు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ, ఇవి ఇంకా నిర్మాణ పనులను స్టార్ట్ చేయాల్సి ఉంది. వీటిల్లో సింధు నదిపై న్యూ గందర్బాల్ ప్రాజెక్టు, చీనాబ్‌పై కిర్తాయ్-2, సవల్‌కోట్, జీలంపై ఉరి-1,2 ప్రాజెక్టులు రెడీగా ఉన్నాయి. కాగా, 1960 సెప్టెంబరులో సింధు, దాని ఉప నదుల జలాలను పంచుకోవడానికి వరల్డ్ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్‌లు దీనిపై సంతకాలు చేశారు.

# భారంగా మారిన బస్‌పాస్



ఒక చేత్తో ఇచ్చి.. మరో చేత్తో లాక్కోవటమంటే ఇదే కాబోలు. మహాలక్ష్మి పథకం పేరుతో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం పేద, మధ్యతరగతి పిల్లల మీద బస్‌పాస్‌ల భారాలేసింది. ఇదేంటని అడిగితే "మసిపూసి మారేడుకాయ" చందంగా డొంక తిరుగుడు సమాధానాలిస్తోంది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉంటున్నందున వారికి ఆర్డినరీ బస్సులతోపాటు మెట్రోల్లో కూడా ప్రయాణించేందుకు వీలు కల్పించామన్నది ఆ సంస్థ వివరణ. వారి సౌక ర్యార్థమే ఈ నిర్ణయం తీసుకున్న దరిమిలా ఛార్జీలను పెంచక తప్పటం లేదన్నది ఉన్నతాధికారుల సమర్థన. కానీ మహిళలకు ఉచిత ప్రయాణ మంటూ చెప్పి.. వారి పిల్లల పాస్‌ల రూపేణా ఆ మొత్తాన్ని పిండుకో జూస్తున్నారనేది జనం వాదన. ఇది సత్యదూర మేమీ కాదు. వాస్తవానికి మహాలక్ష్మి పథకం కోసం నెలకు సగటున రూ.350 కోట్లను సబ్సిడీ రూపంలో ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అలాంటప్పుడు విద్యార్థుల పాస్‌ల ఛార్జీలను పెంచటం ద్వారా సమకూర్చుకోవాలను కుంటున్న రూ.వంద కోట్ల(సుమారు)ను సర్కారు భరించలేదా? అనే ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఆధార్ కార్డు చూపించటం ద్వారా రాష్ట్రంలోని బాలికలు, యువతులందరూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అదే రూపంలో బాలురు, విద్యార్థులకు కూడా ఉచిత ప్రయాణాన్ని కల్పించవచ్చు కదా? అని సామాజికవేత్తలు నిలదీస్తున్నారు. ఇలాంటి ప్రశ్నలకు వేటికీ ఏలికల వద్ద సమాధానాల్లేవు. ఇక్కడ ఓ విచిత్రకరమైన పరిస్థితిని ఆర్టీసీ ఎదుర్కొంటోంది. గతంలో విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, జర్నలిస్టులు తదితరులకు రాయితీపై ఇచ్చే పాస్‌లకయ్యే సబ్సిడీ(రీయింబర్స్‌మెంట్)ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించేది. కానీ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ ఒక్క పథకానికే సబ్సిడీని చెల్లించి, మిగతా పాసులపై ఇస్తున్న సబ్సిడీలకు మంగళం పాడటం గమనార్హం. దీంతో ఆర్టీసీపై పెద్ద మొత్తంలో భారం పడుతోంది. మరోవైపు మహాలక్ష్మి గురించి ఆర్భాటపు ప్రకటనలు గుప్పిస్తోన్న ప్రభుత్వ పెద్దలు దాని అమలుకు తగినట్టుగా బస్సుల సంఖ్యను పెంచటం లేదు. 2023 డిసెంబరులో ఈ పథకాన్ని ప్రవేశపెట్టి నప్పుడే దీనిపై రవాణా రంగ నిపుణులు, ఆర్టీసీ కార్మిక సంఘాలు పలు సూచనలు చేశాయి. ఈ స్కీమ్ సక్రమంగా అమలు కావాలన్నా, మహిళలు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాన్ని వినియోగించు కోవాలన్నా ఇప్పుడున్న బస్సుల సంఖ్యకు అదనంగా మరో మూడు వేల బస్సులను పెంచాలని ఆ సూచనల సారాంశం. ఒక్క హైదరాబాద్ నగరంలోనే వెయ్యి నుంచి 1,500 బస్సులను అదనంగా పెంచాలంటూ ప్రభుత్వానికి ఆయా సంఘాలు సూచించాయి. కానీ బస్సుల సంఖ్యను పెంచకపోగా హైదరాబాద్ వంటి నగరాల్లో కుదించటం గమనార్హం. ఫలితంగా ప్రయాణ సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన రద్దీ. చాలినన్ని బస్సులు లేక, ఉన్నా సీట్లు లేక ఘర్షణలు, గొడవలు షరా మామూలైపోయాయి. సరళీకరణ ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజా రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేయటం పాలకులకు పరిపాటిగా మారింది. అందులో భాగంగానే కొత్త బస్సులను కొనుగోలు చేయకపోవటం, వాటి స్థానంలో అద్దె బస్సులు, కాలం చెల్లిన బస్సులను తిప్పటం రివాజుగా మారింది. అది కాంగ్రెసైనా, బీఆర్ఎస్సైనా మరెవరైనా ఇదే పోకడ. ఈ క్రమంలో ప్రజా రవాణా వ్యవస్థ అనే ఉన్నతమైన ఆలోచనల స్థానంలో లాభాలున్న రూట్లలోనే బస్సులను తిప్పుతామనే స్థితికి ఆర్టీసీ ప్రమాణాలు పడిపోయాయి. లాభాపేక్ష లేకుండా ప్రజలందరికీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలనే ప్రజా రవాణా వ్యవస్థ మౌలిక సూత్రానికి ఈ రకంగా మన పాలకులెప్పటి నుంచో చెల్లుచీటి రాస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు విద్యార్థుల బస్‌పాస్‌లపై భారాలు, మహాలక్ష్మి పథకానికి బస్సుల కోతలు వగైరా. ఛార్జీల పెంపు రూపంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఏ మేరకు భారాలేశారు? ఒక్కో బస్‌పాస్‌పై సగటున ఎంత ఛార్జీ పెరిగింది? అనే లెక్కలను కాసేపు పక్కన పెడితే మొత్తంగా ప్రభుత్వం వైపు నుంచి, ఆర్టీసీ సంస్థ వైపు నుంచి విధానపరంగానే మార్పు రావాలి. ఆదాయాన్వేషణలో భాగంగా ఆర్టీసీ కార్గో విజయవంతమైన నేపథ్యంలో అలాంటి మరిన్ని ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలి. అప్పుడే సంస్థ బలోపేతమవుతుంది. ప్రజా రవాణా వ్యవస్థ సామాన్యుడికి చేరువవుతుంది.

# బడిబాటలో ముళ్ళు, రాళ్లు



పేదవాళ్లకైనా, పెద్దవాళ్లకైనా ఒకే చదువు, ఒకే బడి అది కామన్ స్కూల్ విధానంలో అందరికీ సమానంగా అందించబడాలన్న రాజ్యాంగ స్ఫూర్తి పాలకుల విధానాల వల్ల నీరుగారిపోయింది. పర్యవసానంగా డబ్బులు ఉన్నవాళ్లకి కార్పొరేట్ విద్య, ఏ ఆధారం లేని పేద బడుగు బలహీన వర్గాల బిడ్డలకు ప్రభుత్వ విద్య. రెండు రకాల, రెండు గ్లాసుల విధానం లాగా రెండు 'క్లాస్'ల విధానం కొనసాగుతున్నది. నీళ్లు, నిధులు, నియామకాలతోపాటు విద్య, వైద్య రంగాల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సకల జనుల స్వప్నం నెరవేరుద్ది అనుకున్నాం. విద్యారంగం ఆంధ్ర వలసాధిపత్యం కార్పొరేటీకరణ కబంధహస్తాల నుండి బయటపడి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పలుమార్లు అన్నట్లు తెలంగాణలో విద్య అందరికీ, సమానంగా అందించబడు తుంది అన్న కల నెరవేరకపోగా, దశాబ్ది తెలంగాణ పాలన అనంతరం తెలంగాణ విద్యారంగం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కన్నా వెనుక ఉండటం అత్యంత విచారకరమైన సందర్భం. నూతనంగా అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని సమీక్షిస్తూ, దాన్ని మూలాలను మార్చే ఒక ప్రయత్నంలో భాగంగా ఒక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందించదగ్గ, ఆహ్వానించదగ్గ అంశమే. అయితే ఆ విద్యా కమిషన్ సూచించినట్టుగా మండలానికి మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, ప్రీ ప్రైమరీ స్కూల్స్ దశలవారీగా ఏర్పాటు చేయడానికి సూచించిన బడ్జెట్‌ను ఆమోదించకపోవడం విచారకరం. తాము అధికారంలోకి రావడానికి 15% విద్యారంగానికి నిధులు కేటాయిస్తామని చెప్పిన వాగ్దానం సగానికి మించి ఆమోదించబడలేదు. ఇందుకు భిన్నంగా అసలు రాష్ట్రంలో వివిధ యాజమాన్యాల్లో కొనసాగుతున్న విద్యారంగాన్ని ఒక గొడుగు కిందికి తీసుకురావాల్సిన విధానం పోయి ఇప్పటికీ ఇంకా రెసిడెన్షియల్, మోడల్, ప్రభుత్వ, ప్రైవేటు, కెజిబివి, లోకల్ బాడీ తదితర రూపాల్లో విద్య అందించబడటం అసమానతల్ని పెంపొందిస్తున్నది. కులానికో రెసిడెన్షియల్ పాఠశాలలు పెట్టి అన్ని కులాలకు సంబంధించిన గ్రామీణ ప్రాంతంలో అందరూ కలిసి చదువుకునే పాఠశాలల వ్యవస్థను క్రమంగా కూలదోస్తూ వస్తున్నారు. వీటిని సరి చేయవలసిన విద్యారంగా విధానాలు మరొక కొత్త రూపాన్ని యంగ్ ఇండియా ఇనిషియేటివ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్ఎస్) పేర నియోజకవర్గానికి ఒక పాఠశాల అది 25 ఎకరాలతో 200 కోట్ల రూపాయలతో నిర్మితం కాబోతున్నది. దీన్ని ప్రభుత్వం సంకల్పిస్తున్నట్టుగా ఆయా వర్గాలకు దోహదపడుతుందన్న ఒక అంశం ఆహ్వానించదగ్గది అయినా అదే కోవలో ఆయా వర్గాలకు, అందరికీ అలాంటి విద్య అందకుండా కొందరికి మాత్రమే అందించే దిశలో మిగిలిన పాఠశాలలల్ని పట్టించుకొని స్థితి కొనసాగుతుంది. గత ప్రభుత్వం మన ఊరు మన బడి కింద కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి ఫ్యాన్లు, రంగులు వేసి ఇతర అంశాలు వదిలేస్తే, అవి అలాగే నిర్లక్ష్యంలో అది రూ. 200 కోట్లు ఒక నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోకి పాఠశాలకు రూ. 50 లక్షలు కేటాయించినా ఆ పాఠశాల మౌలిక వసతుల్ని పెంపొందిస్తూ పాఠశాలను ఉన్నతీకరించవచ్చు. ఇందుకు భిన్నంగా అసలు విద్యార్థుల సంఖ్య పెరగకపోవడానికి కారణాలు అన్వేషిస్తూనే పెంచుకోవడానికి ఒక అవకాశం ఇవ్వవలసిన సందర్భంలో ముందే వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కోసం ఉపాధ్యాయులను తరలిస్తూ పాఠశాలలను మూసివేసే నిర్ణయం అయితే ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు జులై 15 వరకు పొడిగించడం ఒక ఆహ్వానించదగ్గ. అయితే ఈ వెసులుబాటును నిజంగానే మొన్నటిదాకా పొందిన శిక్షణాల ప్రేరణతోపాటు బడిబాటలో చూపిస్తున్న చొరవతో విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటూ పాఠశాలలను నిలబెట్టే ఒక ప్రయత్నం ఉపాధ్యాయ వర్గం నిర్విరామంగా చేయవలసి అట్లా నిలదొక్క లేకపోతే మూసివేత తప్ప గురవుతున్న పాఠశాలల్ని స్థానిక ప్రజల సహకారం ప్రమాణాల పెంపుదలతో ప్రయత్నించకపోతే అనివార్యంగా ప్రభుత్వం కోరుకుంటున్నా మూసివేత కొనసాగే ప్రమాదం ఉంది. ఎప్పటిలాగే ప్రతి సంవత్సరం జరిగే తంతులాగే విద్యా రంగం పాఠశాల ప్రారంభోత్సవానికి ముందు బడిబాట పేరిట జయశంకర్ సార్ స్ఫూర్తితో ఓ ప్రచారపర్వం ఇప్పుడు ఊరూర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామసభల పేర కొనసాగుతున్నది. మే నెల మధ్యలో దాదాపు లక్షన్నర ఉపాధ్యాయులకి రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతలుగా ఐదు రోజుల చొప్పున ఆయా సబ్జెక్టులలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం శిక్షణా తరగతులు జరిగాయి. ఆ శిక్షణా తరగతుల్లో అదే పనిగా పదేపదే చెప్పిన అంశాలనే మళ్లీమళ్లీ చెప్తున్నా ఆ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు కాస్త ప్రేరణ పొందుతున్నా తీరా బడి దాకా వచ్చాక బడిలో బడిబాటలో కొనసాగుతున్నా ఎందుకు విద్యార్థుల సంఖ్య పెరగటంలేదు. విద్యారంగం ఎదుర్కొంటున్న ఆయా సమస్యల్ని పరిష్కరించుకోకుండా ప్రజలు, ప్రభుత్వం టీచర్ల మీద విసురుతున్న రాళ్లు, ముళ్లను ఏరకుండా ఇవాల్టి ప్రభుత్వ విద్యారంగాన్ని బాగుపరచుకునే స్థితి లేదా ప్రమాణాల్ని పెంచడానికి విద్యార్థుల సంఖ్య తగ్గిపోకుండా ఉండడం సాధ్యం కాదు. ఇన్ని సమస్యల మధ్య కూడా ప్రభుత్వం ఇవాళ కొత్తగా వచ్చిన విద్య అధికారుల పట్టింపు వల్ల కొత్త వరవడిలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు ప్రమాణాలను పెంచడానికి బడిబాట ఒక రకంగా ప్రభుత్వ టీచర్లు సవాలుగా స్వీకరించవలసి ఉన్నది. అన్ని వసతుల తరగతితో విద్యార్థుల హాజరు, టీచర్లు హాజరు సరిగ్గా ఉన్నటువంటి పాఠశాలల్లో కూడా ఎందుకు విద్యా ప్రమాణాలు పెరుగుతలేదు? అందుకు కారకులు ఎవరో సమీక్షించుకోవాల్సి ఉంది. అలాగే ఆయా స్థితిగతుల్ని బాగు చేయడానికి ప్రభుత్వం ఆయా పాఠశాలలను ఉన్నతీకరించడానికి పర్యవేక్షణతోపాటు భౌతిక వనరుల్ని సామర్థ్యాలను పెంచడానికి నిధులు పెంచవలసి ఉన్నది. ఏ అర్హతలు లేని, కనీస వేతనం, సెలవులు, ఉద్యోగ భద్రత లేని ప్రైవేటు టీచర్లు ఎంత లేదన్నా కొంతమేర కనీస సామర్థ్యాలు సాధిస్తున్నప్పుడు, అవన్నీ ఉండి బడికి వచ్చే పిల్లలు కనీసం చదవడం, రాయడం లక్షల్లో జీతాలు పొందుతున్న టీచర్లు, ఆ జీతాలు ఆ పిల్లల తల్లిదండ్రుల రక్తమాంసాల చమట బిందువులేనని గుర్తించి బాధ్యతాయుతంగా పని చేయడంవల్ల మాత్రమే ప్రభుత్వపాఠశాలలను కాపాడుకోగలం. ఇవాళ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే ప్రయత్నం అటు ప్రభుత్వం, ఇటు టీచర్లు, విద్యార్థి సంఘాలు, పౌరసమాజం ఒక బాధ్యతగా స్వీకరించకపోతే భవిష్యత్తులో మళ్లీ వెసలుబాటు ఉన్న వర్గాలకు తప్ప బడుగు బలహీన పేద వర్గాల పిల్లలు బడికి దూరం అయిపోయి ఓ అంధకార బంధురమైన విద్యా విలువలు లేని సమాజ నిర్మాణంలో పునాదిరాళ్లను వేసినట్లే.

# ప్రతిధ్వనించిన భారత్ సందేశం





పహల్గాం ఉగ్రదాడి పాకిస్తాన్ ప్రోద్బలంతో జరిగిన సంగతి తెలిసిందే. అమాయక ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకున్న ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్‌లోని ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టింది. అత్యంత సాహసోపేతమైన ఈ ఆపరేషన్ సిందూర్ దాడులు భారత్ చరిత్రలో చెప్పుకోదగిన ఘట్టం. ఇంతటితో ఆగిపోకుండా పాక్‌లో ఉగ్రవాదులు ఎక్కడ దాగున్నా లోపలికి చొరబడి ఆపరేషన్ సిందూర్ దాడులు కొనసాగుతుంటాయని భారత్ తన వైఖరిని స్పష్టం చేస్తోంది. ఉగ్రమూకలకు శిక్షణ కేంద్రంగా తయారైన పాక్ ప్రభుత్వ ఉగ్రవాద అనుకూల విధానాలను ఎండగడుతూ భారత్ వాణిని బలంగా ప్రపంచ దేశాలకు స్పష్టం చేయడానికి కేంద్రం పంపించిన ప్రతినిధి బృందాలు 32 విదేశాల రాజధానుల్లో, యూరోపియన్ యూనియన్‌లో పర్యటించాయి. ఈ ఏడు బృందాల్లో మొత్తం 59 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో చాలావరకు పార్లమెంట్ సభ్యులు, మాజీ దౌత్యవేత్తలు ఉన్నారు. ఉగ్రవాదంపై పోరులో అంతా ఏకతాటిపై ఉన్నామనే జాతీయ ఐక్యతా సందేశాన్ని ప్రపంచ దేశాలకు వీరు చక్కగా అందించగలిగారు. నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన ఈ ప్రతినిధి బృందాలతో ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తన అధికారిక నివాసంలో భేటీ అయ్యారు. ప్రతినిధుల పర్యటన అనుభవాలను తెలుసుకుని వారిని ప్రశంసించారు. ప్రపంచ దేశాలకు భారత్ అందించే సందేశం విదేశీ ప్రభుత్వాలకే కాదు, చట్టసభ్యులకు, విదేశీ మీడియా, సామాన్య ప్రజానీకం వరకు చేరాలన్నదే భారత ప్రభుత్వ ఉద్దేశం. అంతేకాదు, ముఖ్యంగా ఏయే దేశాల్లో భారత్‌కు మద్దతు లభించదని భావిస్తుంటారో ఆ దేశాలకు కూడా ఈ సందేశం అందించడం విశేషం. భారత ప్రతినిధి వర్గం సందర్శించిన దేశాలు చాలావరకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యదేశాలు. భద్రతా మండలి అశాశ్వత సభ్యులుగా ఉన్నవి. వచ్చే సంవత్సరం భద్రత మండలిలో సభ్యత్వం పొందనున్నవి కూడా ప్రతినిధి బృందం సందర్శించిన వాటిలో ఉన్నాయి. ఇది చాలా అవసరం. ఎందుకంటే 2025 26 సంవత్సరానికి సంబంధించి భద్రతా మండలి సభ్యదేశంగా పాకిస్థాన్ ఎన్నికైన నాటి నుంచి భారత్‌కు భద్రతా మండలి తీర్మానాల్లో చిక్కులు ఎదురవుతున్నాయి. ఏదైనా ప్రపంచ స్థాయి సమస్యలపై మండలి తీర్మాన పాఠాన్ని కూడా మార్పు చేయగలదు. పహల్గాం ఉగ్రదాడికి తామే బాధ్యులమన్న కశ్మీర్‌లోని ఉగ్రవాద సంస్థ 'ది రెసిస్టెంట్ ఫ్రంట్' ప్రకటించినప్పటికీ దాన్ని ఉదాహరణగా చూపించడానికి పాక్ ఒప్పుకోవడం లేదు. ఆ మేరకు భద్రతా మండలి తీర్మాన పాఠంలో ప్రస్తావించినా మార్పు చేసే తెలివి పాకిస్తాన్‌కు ఉంది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు ఐక్యరాజ్యసమితి కీలక బాధ్యతలు కట్టబెట్టడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్ ఛైర్మన్‌గా పాక్ ఎన్నిక కావడమే కాకుండా తాలిబన్ల ఆంక్షల కమిటీ బాధ్యతలను కూడా పాక్ చేపట్టడం విడ్డూరం. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాదులను ఐక్యరాజ్యసమితి తీర్మానాల ద్వారా జవాబుదారులుగా నిలబెట్టడానికి భారత్ విశ్వప్రయత్నం చేస్తోంది. ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్సు వద్ద కూడా పాక్‌కు అడ్డుకట్ట వేయాలని భారత్ ప్రయత్నాలు ఫలించలేదు. అమెరికా, చైనా వంటి అగ్రరాజ్యాలకు మాత్రమే కాక, ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్ వంటి ప్రపంచస్థాయి సంస్థలకు కూడా పాక్‌పై వల్లమాలిన ప్రేమ పుట్టుకొస్తుంది. ప్రతినిధి బృందం న్యూయార్క్, వాషింగ్టన్ వెళ్లినప్పుడు పాక్ చర్యలను ఎండగట్టడంపైనే దృష్టి పెట్టింది. భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని, వాణిజ్య సంబంధాలను ఉపయోగించి అణుయుద్ధం తప్పించగలిగానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాహాటంగా వ్యాఖ్యానించడం కాస్త ఉద్రిక్తతలకు దారితీసింది. అందుకనే అమెరికాలో ప్రతినిధి బృందం పర్యటించడం ఎంతైనా ఇప్పుడు అవసరమేనని దౌత్యవేత్తలు సమర్థిస్తున్నారు. ఈ పర్యటనలు ఎంతవరకు విజయవంతమయ్యాయో చూస్తే భారత్‌లో కొన్నివిమర్శలు వినిపించాయి. ప్రతినిధి బృందాలు ఆయాదేశాల్లో భారతీయ సమాజాలతో మాట్లాడడానికే ఎక్కువ సమయం వెచ్చించారని, ఆయాదేశాల్లోని దౌత్యవేత్తలను ప్రభావితం చేయడానికి బదులు భారత మీడియా వర్గాలతోనే ఇంటర్వ్యూలు ఇవ్వడం చేశారని విమర్శలు వచ్చాయి. ప్రతినిధుల బృందాలు పాక్ పట్ల తమ దేశ దృఢమైన వైఖరిని సరిగ్గా వినిపించలేక పాకిస్తాన్, భారత్ మధ్య కుక్కపిల్లి వైరం ఉన్నట్టు వాదించడమే ఎక్కువగా కనిపించిందన్న ఆరోపణలు వచ్చాయి. ఏదెలాగున్నా భారతదేశ భద్రత, సమగ్రత, ఐక్యతపై జాతీయ స్పృహ ప్రతిబింబించేలా ప్రతినిధి బృందాల విస్తృతమైన సందేశం అత్యంత శక్తివంతంగా పనిచేసింది. భారత్‌లో మోడీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం క్షీణిస్తోందని, మెజారిటీవాదమే తీవ్రంగా మారుతోందని అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రతినిధి బృందాలు పార్టీలకు, సిద్ధాంతాలకు అతీతంగా ఒకే మాటగా, ఒకే బాటగా ప్రపంచానికి భారతదేశ సమైక్యత, భద్రతపై దృఢమైన సంకల్పాన్ని చాటిచెప్పడం ఎంతైనా ముదావహం. ప్రతినిధుల ఎంపికలో కూడా కేంద్ర ప్రభుత్వం తెలివిగా వ్యవహరించింది. విదేశాల్లో భారత్ పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించి, బహుళ వైవిధ్య భాషా, సాంస్కృతికత చిత్రాన్ని ప్రదర్శించాలన్న దూరదృష్టితో సమర్థులను ఏరికోరి ఎంచుకుంది. రాష్ట్రాలనుంచి, పార్టీలకు అతీతంగా, అనుభం గలిగిన సీనియర్ రాజకీయ నేతలు ప్రతినిధి వర్గాల్లో చోటుచేసుకున్నారు. వీరి లౌకికవాదం, సామరస్యం, సుహృద్భావం ఫలితంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆయా దేశాల్లో ప్రతిధ్వనులు వినిపిస్తాయన్న అభిప్రాయం కలుగుతోంది.

## అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానం




గాంధీనగర్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలింది. మెఘానిలోని గుజ్సెల్ విమానాశ్రయ సమీపంలో నివాస ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి రెండు గంటల మధ్య ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. గాంధీనగర్ : బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ ట్విన్ జెట్ ఎయిరిండియాలో విమానం మొత్తం 230 మంది ప్రయాణికులు, పైలెట్, కో పైలెట్ సహా 12మంది సిబ్బంది ఉన్నారు. లండన్ వెళ్లేందుకు విమానం అహ్మదాబాద్‌లోని రన్‌వే 23 నుండి టేకాఫ్ అయ్యింది. కొన్ని నిమిషాలకే కుప్పకూలింది. పైలెట్ సుమిత్ సభర్వాల్‌కు 8,200 పనిగంటల అనుభవం ఉంది. కో పైలెట్‌కు 1100 గంటల అనుభవం ఉందని అధికారులు తెలిపారు. ఘటనాస్థలికి 12 అగ్ని మాపక యాంత్రాలు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. విమానాశ్రయానికి వెళ్లే అన్ని రహదారులను మూసివేశారు. గాయపడిన వారిని తరలించేందుకు గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేశారు. తదుపరి నోటీసులు జారీ చేసేవరకు విమానాశ్రయంలో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు విమానాశ్రయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి కె. రామ్మోహన్ నాయడు హుటాహుటిన అహ్మదాబాద్‌కు పయనమయ్యారు.

## లాస్ ఏంజిల్స్‌లో ఉద్రిక్తత.. కర్ఫ్యూ విధింపు




అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో వలస విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. పెరిగిపోతున్న అల్లర్లు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని డౌన్‌టౌన్ ప్రాంతంలో రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ విధిస్తున్నట్లు ప్రకటించారు. వరుసగా నాలుగు రాత్రులుగా నగర కేంద్రంలో హింస, లూటీలు, విధ్వంసం చోటుచేసుకున్నాయి. 23కు పైగా వ్యాపార సంస్థలు లూటీకి గురయ్యాయని తెలిపారు. తదుపరి నష్టం జరగకుండా నిరోధించేందుకే ఈ కర్ఫ్యూ నిర్ణయం తీసుకున్నట్లు మేయర్ వెల్లడించారు. మరోవైపు లాస్ ఏంజిల్స్‌లో మొదలైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. నిరసనలు ఆస్టిన్, టెక్సాస్, చికాగో, న్యూయార్క్, డల్లాస్, డెన్వర్‌తో సహా అనేక ఇతర నగరాల్లో ఆందోనలు కొనసాగుతున్నాయి. లాస్ ఏంజిల్స్ లో శనివారం నుంచి అధికారులు ఇప్పటి వరకు సుమారు 400 మందిని అరెస్టు చేశారు. వీరిలో 330 మంది వలసదారులు ఉండగా, మరో 157 మందిని వారికి మద్దతు తెలిపినందుకు అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసనలను అణిచివేయడానికి అధ్యక్షుడు ట్రంప్ 700 మంది మెరైన్లతో సహా వేలాది మంది సైనికులను లాస్ ఏంజిల్స్ లో మోహరించారు. దీంతో ఆందోళనలు చేస్తున్న ప్రజలను పోలీసులు అరెస్టు చేస్తున్నారు.

## ఢిల్లీలో ఠారెత్తిస్తున్న ఎండలు ..
## 45 డిగ్రీలకు చేరిన గరిష్ట ఉష్ణోగ్రత



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. సాధారణంగా మే నెలలో నమోదవ్వాల్సిన ఉష్ణోగ్రతలు జూన్ మొదటి వారంలో నమోదవుతున్నాయి. గత కొన్ని రోజులుగా వేడి వాతావరణం, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం కూడా నగరంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్‌ను దాటినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఉదయం 8.00 గంటలకే ఉష్ణోగ్రతలు మండిపోతున్నాయి. ఢిల్లీలోని అయన్ నగర్‌లో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయన్ నగర్ ప్రాంతంలో గరిష్టంగా 45 డిగ్రీలు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 30.5 డిగ్రీలుగా ఉంది. వరుసగా పాలం ప్రాంతంలో 44.5 (గరిష్టం), 30.2 (కనిష్టం), రిడ్జ్‌లో 43.6 (గరిష్టం) , 26.2 (కనిష్టం) , లోధి రోడ్‌లో 43.4 (గరిష్టం), 29.2 (కనిష్టం), మరియు సఫ్దర్‌గంజ్ ప్రాంతంలో 43.3 (గరిష్టం), ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఢిల్లీ సహా ఎన్‌సిఆర్ ప్రాంతాల్లో 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఈ వారం ప్రారంభంలో ఐఎండి హెచ్చరించిన సంగతి తెలిసిందే. వాయువ్య భారతదేశంలో మరో నాలుగు రోజుల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకావం ఉందని హెచ్చరించింది. అధిక వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ప్రాంతంలో ఎల్లో అలర్ట్ జారీచేసినట్లు ఐఎండి అధికారి అఖిల్ శ్రీవాస్తవ తెలిపారు. జూన్ 14 తర్వాత క్రమంగా వేడిగాలుల నుండి ఉపశమనం లభించే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి సాధారణ వర్షాలు కురుస్తాయని, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40నుండి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఐఎండి అంచనా వేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు స్పీడప్



**హైదరాబాద్, :** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) దర్యాప్తు మరింత వేగంగా సాగుతోంది. ఇప్పటికే అనేకమంది అధికారులను విచారించిన సిట్, ఈ కేసులో కీలకంగా భావిస్తున్న మాజీ ఎస్ఆర్ఎస్ అధికారి ప్రణీతరావు, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావులను విచారణకు పిలిచింది. రేపు ప్రణీతరావు, ఎల్లుండి ప్రభాకర్ రావు హాజరుకావాలని సిట్ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో అత్యంత సంచలనంగా మారిన అంశం.. రెండు టెరాబైట్ల హార్డ్ డిస్క్‌ల ధ్వంసం వ్యవహారం. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలకమైన డేటా ఉన్న ఈ హార్డ్ డిస్క్‌ను ప్రణీతరావే ధ్వంసం చేశారని సిట్ అనుమానిస్తోంది. ఆమె ఈ హార్డ్ డిస్క్‌ను నాశనం చేసి, వాటిని మూసీ నదిలో పడేసినట్లు ఆధారాలు లభించాయి. విచారణలో ఆమెకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. అలాగే, ఈ చర్య వెనుక ప్రభాకర్ రావు ప్రమేయం ఉందని సిట్ అనుమానిస్తోంది. అయితే, ప్రభాకర్ రావు మాత్రం తాను పదవి నుంచి రాజీనామా చేసి వెళ్లిపోయిన తరువాతే హార్డ్ డిస్కల ధ్వంసం జరిగిందని చెబుతున్నారు. వీరి మధ్య ఎదురు ఆరోపణలు, వివరణలతో కేసు మరింత మలుపు తిరిగింది. ఇప్పుడు దర్యాప్తు అధికారుల దృష్టి మూడు కీలక అంశాలపై ఉంది.. హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేయాలని ఆదేశించినది ఎవరు? ఈ నిర్ణయం వెనుక ఉద్దేశ్యం ఏమిటి? ధ్వంసమైన డేటాలో ఏమి ఉండేది? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికితే, ఈ కేసు వెలుగు చూసే విధానం పూర్తిగా మారే అవకాశం ఉంది.

## భారత్‌లో కనీస రేటు కంటే తక్కువ
### ఇలాగే కొనసాగితే తగ్గనున్న జనాభా

# జననాల తగ్గుదల వరమా.. శాపమా?



ప్రపంచంలో మరే దేశానికి లేనంతటి యువశక్తి భారత్ సొంతం. మొత్తం జనాభాలోనూ చైనాను అధిగమించి ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచాం. అయితే ప్రపంచవ్యాప్త ట్రెండుకు అనుగుణంగా భారత్‌లో కూడా జననాల రేటు భారీగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. జనాభా పెరుగుదల స్థిరంగా కొనసాగాలంటే జననాల (టీఎఫ్‌ఆర్-టోటల్ ఫెర్టిలిటీ) రేటు కనీసం 2.1 ఉండాలి. అంటే ప్రతి మహిళ కనీసం ఇద్దరిని కనాలన్నమాట. దీన్ని భర్తీ రేటుగా పిలుస్తారు. కానీ భారత్‌లో టీఎఫ్‌ఆర్ ఏకంగా 1.9కి పడిపోయిందని 'సంతాన సంక్షోభం' పేరిట ఐక్యరాజ్యసమితి జనాభా కార్యకలాపాల నిధి (యూఎన్‌ఎఫ్‌పీఏ) విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. దాంతో జననాల రేటు తగ్గుదల ప్రభావం మన దేశంపై అంతిమంగా ఎలా ఉండనుందన్న చర్చ జోరందుకుంది.

### ఇదీ పరిస్థితి!

1.9 టీఎఫ్‌ఆర్ కారణంగా భారత్‌లో జనాభా పెరుగుదల నానాటికీ తగ్గి 40 ఏళ్లకు ఆగిపోతుందని యూఎన్‌ఎఫ్‌పీఏ అంచనా వేసింది. అప్పటికి దేశ జనాభా 170 కోట్లకు చేరి అక్కడి నుంచి తగ్గుముఖం పడుతుందని పేర్కొంది. కానీ భారత్‌లో టీఎఫ్‌ఆర్ శరవేగంగా 1.29కు పడిపోతుందని గతేడాది లాన్సెట్ జరిగిన అధ్యయనం శాస్త్రీయంగా అంచనా వేసింది. అదే జరిగితే దేశ జనాభాలో తగ్గుదల 40 ఏళ్లకంటే చాలా ముందే మొదలయ్యే వీలుంది. 1950ల్లో ఒక్కో భారత మహిళ సగటున ఏకంగా ఆరుగురిని కనేది! 1980ల నాటికి అది 4.6కు తగ్గింది. అక్కడినుంచి ఇద్దరు పిల్లలు చాలనే పరిస్థితికి రావడానికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో శ్రమించాల్సి వచ్చింది. చిన్న కుటుంబాలు పరిపాటిగా మారిపోయాయి. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగిన కొద్దీ వారు కనే పిల్లల సంఖ్య మరింతగా తగ్గుతూ వస్తోంది. ఎక్కువమందిని కని కెరీర్‌ను పణంగా పెట్టేందుకు వారు ఇష్టపడటం లేదు. పిల్లల పెంపకంలో వారికి భర్త మద్దతు లేకపోవడమూ దీనికి కారణమే.

### ఆందోళన అక్కర్లేదు!

జననాల రేటు (టీఎఫ్‌ఆర్) తగ్గితే జనాభాపరంగా చాలా మార్పులు చోటుచేసుకుంటా యి. ముఖ్యంగా యువ శ్రామిక శక్తి క్రమంగా తగ్గిపోతుంది. వృద్ధుల సంఖ్య పెరిగిపోతుంది. "2050 నాటికి భారత జనాభాలో వృద్ధుల సంఖ్య ఐదో వంతుకు చేరుతుంది. చైనాది ప్రస్తుతం ఇదే పరిస్థితి. ఒకే సంతానం నిబంధనను దశాబ్దాలుగా కఠినంగా అమలు చేయడమే అందుకు కారణం" అని జనాభా నిపుణులు చెబుతున్నారు. "జనాభా పెరుగుదలను బాగా తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలన్నీ దాని పర్యవసానాలను ఇప్పటికే అనుభవిస్తున్నాయి. మొత్తం 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో టీఎఫ్‌ఆర్ ఇప్పటికే 2.1 కంటే చాలా తక్కువకు పడిపోయింది. బిహార్ (3), మేఘాలయ (2.9), ఉత్తరప్రదేశ్ (2.7) వంటివి మాత్రమే ఇందుకు మినహాయింపు" అని ఇంటర్నేషనల్ ఇన్‌స్టి ట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ డెమోగ్రఫీ ప్రొఫెసర్ శ్రీనివాస్ గోలి వివరించారు. "అంతమాత్రాన టీఎఫ్‌ఆర్ తగ్గుదలను చూసి ఇప్పటికిప్పుడు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. దీనివల్ల కార్మిక శక్తి భారీగా తగ్గుతుందన్నది అపోహ మాత్రమే. నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ప్రాంతాల మధ్య వలసలను మరింతగా ప్రోత్సహించడం ద్వారా సమస్యను సులువుగా అధిగమించవచ్చు" అని అభిప్రాయపడ్డారు. అయితే వృద్ధుల సంఖ్య పెరుగుదల ఒక్కటే మున్ముందు భారత్‌కు సమస్యగా మారే ఆస్కారముందని ఆయన అంచనా వేశారు. "వయోపరమైన అంతరం నానాటికీ పెరిగిపోయి చివరికి పెద్దవాళ్ల ఆలనాపాలనా చూసే వారసుల సంఖ్య తగ్గిపోతుంది. ఆ పరిస్థితుల్లో వృద్ధుల సంరక్షణకు అవసరమైన వసతులు, ప్రభుత్వపరమైన సౌకర్యాలు మన దగ్గర బాగా తక్కువే" అని గుర్తు చేశారు. 60-75 ఏళ్ల వయసు వారికి ఇప్పటిమాదిరిగా తగిన ఉపాధి అవకాశాలు కూడా మున్ముందు సవాలుగానే మారవచ్చని అహ్మదాబాద్‌లోని ఎల్‌జే వర్సిటీ ప్రొఫెసర్ అమితాబ్ కుందు అభిప్రాయపడ్డారు.

# న్యూయార్క్ మేయర్ రేసులో మీరా నాయర్ కుమారుడు

### పోటీలో ముందంజలో ఉన్న జోహ్రాన్ క్వామి మమ్‌దానీ
### ఆకట్టుకుంటున్న ఎన్నికల అజెండా
### దక్షిణాసియా మూలాలను గుర్తుచేస్తూ ప్రచారం



ప్రఖ్యాత సినీ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు, ఇండియన్-అమెరికన్ రాజకీయ నాయకుడు జోహ్రాన్ క్వామి మమ్‌దానీ అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ మేయర్ పదవికి పోటీ పడుతున్నాడు. ఒడిశాలో జన్మించిన మీరా నాయర్ 'మీరాబాయి ఫిలిమ్స్'బ్యానర్ కింద పలు చిత్రాలు నిర్మిండడంతోపాట దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. కామసూత్ర, మాన్‌సూన్ వెడ్డింగ్, సలామ్ బాంబే వంటి చిత్రాలతో ఆమె సంచలనం సృష్టించారు. డెమొక్రటిక్ పార్టీ సభ్యుడైనా ఆమె కుమారుడు మమ్‌దానీ ప్రస్తుతం న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. న్యూయార్క్ సిటీ మేయర్ ఎన్నికలు త్వరలో జరుగబోతున్నాయి. ఈ పదవికి మాజీ గవర్నర్ ఆండ్రూ కౌమో పేరు ప్రస్తుతం ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు ఆయనకు మమ్‌దానీ గట్టి పోటీనిస్తున్నాడు. నిధుల సేకరణ, నూతన ఆలోచనలు, ఆశయాలతోపాటు టెక్నాలజీని విస్తృతంగా వాడుకుంటూ జనాదరణ పొందే ప్రయత్నం చేస్తున్నాడు. ఆండ్రూ కౌమోను ఓడించడం ఖాయమని ధీమాగా చెబుతున్నాడు. ఒకవేళ మమ్‌దానీ అనుకున్న లక్ష్యం సాధిస్తే.. న్యూయార్క్ సిటీకి మొట్టమొదటి ముస్లిం మేయర్‌గా, తొలి ఇండియన్-అమెరికన్ మేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

### ఎవరీ మమ్‌దానీ?

జోహ్రాన్ మమ్‌దానీ 1991 అక్టోబర్ 18న ఉగాండాలోని కంపాలాలో జన్మించాడు. ఆయన తండ్రి మహమూద్ మమ్‌దానీ, తల్లి మీరా నాయర్. మహమూద్ మమ్‌దానీ ఉగాండాతో ప్రముఖ మార్క్సిస్ట్ పండితుడు. జోహ్రాన్‌కు ఐదేళ్ల వయసున్నప్పుడు ఆ కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు చేరుకుంది. రెండేళ్ల తర్వాత అమెరికాలోని న్యూయార్క్‌లో స్థిరపడింది. జోహ్రాన్ మమ్‌దానీకి 2018లో అమెరికా పౌరసత్వం లభించింది. బ్రాంక్స్ హైస్కూల్ ఆఫ్ సైన్స్‌తోపాటు బౌడిన్ కాలేజీలో విద్యాభ్యాసం చేశాడు. కాలేజీలో ఉన్నప్పుడు రాజకీయాలపై ఆసక్తి చూపించేవాడు. స్థానికంగా రాజకీయ, సేవ కార్యక్రమాల్లో వాలంటరీగా సేవలందించేవాడు. 2017లో డెమొక్రటిక్ సోషలిస్టు ఆఫ్ అమెరికా అనే సంస్థలో చేరాడు. తర్వాత డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా 2020, 2021, 2022, 2024లో న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. క్వీన్స్ 36వ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. చట్టసభల్లో చురుగ్గా పని చేస్తున్నాడు. 20 బిల్లును ప్రతిపాదించగా, అందులో మూడు బిల్లులు చట్టాలుగా మారాయి. న్యూయార్క్ మేయర్ రేసులో 2024 అక్టోబర్ 23న అడుగుపెట్టాడు. జోహ్రాన్ మమ్‌దానీలో మంచి కళాకారుడు కూడా ఉన్నాడు. 2019లో 'నానీ'పేరిట ఒక మ్యూజిక్ వీడియో విడుదల చేశాడు. షియా ముస్లిం మతస్థుడైన మమ్‌దానీ ఇటీవలే రమా దువాజీని వివాహం చేసుకున్నాడు. ఆమె సిరియాలో జన్మించారు. పలు పత్రికల్లో చిత్రకారిణిగా పనిచేశారు. మమ్‌దానీ దంపతులు క్వీన్స్‌లోని అస్టోరియాలో నివాసం ఉంటున్నారు.

### పాలస్తీనాకు మద్దతు

మమ్‌దానీ ఎన్నికల అజెండా ప్రజలను ఆకట్టుకుంటోంది. నగరంలో అద్దెలపై ఫ్రీజింగ్ విధిస్తానని, రవాణా, శిశు సంరక్షణ సేవలు ఉచితంగా అందిస్తానని, కనీస వేతనాన్ని 30 డాలర్లకు పెంచుతానని మమ్‌దామీ హామీ ఇస్తున్నారు. ఇక ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో మమ్‌దానీ పాలస్తీనాకు బహిరంగంగా మద్దతు పలుకుతున్నాడు. గాజాలో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేస్తున్నారు. అన్ని రకాల వివక్షకు ఆయన బద్ధవ్యతిరేకి. అలాగే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను మమ్‌దానీ నిశితంగా విమర్శిస్తున్నాడు. ఎన్నికల ప్రచారంలో తన దక్షిణాసియా మూలాలను పదేపదే గుర్తుచేస్తున్నాడు. హిందీ భాషలో ఒక వీడియో విడుదల చేశాడు. ఇందులో బాలీవుడ్ సినిమాలు, డైలాగ్‌ల ప్రస్తావన ఉంది. బిలియనీర్స్ కే పాస్ ఆల్రెడీ సబ్ కుచ్ హై, అబ్ ఆప్‌కా టైమ్ ఆయేగా(ధనవంతులకు అన్నీ ఉన్నాయి. ఇప్పుడు మీ వంతు వస్తుంది) అని ఓటర్లకు చెబుతున్నాడు. ఈ నెల 24న మేయర్ ఎన్నిక జరుగనుంది. ర్యాంక్డ్%-%చాయిస్ వోటింగ్ సిస్టమ్ ద్వారా మేయర్‌ను ఎన్నుకుంటున్నారు. అంటే ఓటర్లు తమ ప్రాధాన్యత ప్రకారం ఐదుగురు అభ్యర్థులకు ర్యాంకులు ఇస్తారు. ఈ ర్యాంకుల్లో అగ్రస్థానంలో నిలిచిన అభ్యర్థికి మేయర్ పదవి లభిస్తుంది.

# మస్క్ 'కాల్పుల విరమణ'!



అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సభల్లో డోనాల్డ్ ట్రంప్ వెనుకనో, పక్కనో అంతెత్తు గెంతుతూ... ఆయన అధ్యక్షుడయ్యాక తరచుగా వైట్ హౌస్‌కు సంతాన సమేతంగా వస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఎలాన్ మస్క్ నాలుగు రోజులపాటు ట్రంప్‌తో బహిరంగ యుద్ధానికి దిగి, ఇంతలోనే బుధవారం నాడు దానికి శుభం కార్డు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తరచు ఒకటిగానే కనబడే రాజ్యశక్తి, ధనశక్తి నిజంగా కొట్లాటకు దిగితే చివరాఖరికి రాజ్యశక్తిదే పైచేయి అవుతుందని ఈ స్వల్పకాల ఉపాఖ్యానం నిరూపించింది. అధికారంలోకొచ్చినప్పటి నుంచీ ట్రంప్‌కు దాదాపు ప్రతిపక్షం లేదు. ఆయన పాలనపై ఓ కన్నేసి ఉంచాల్సిన అమెరికన్ కాంగ్రెస్ నిరాసక్తంగా ఉంది. వలస విధానం అంశంలో కోర్టులు కాదంటున్నా పంతం నెగ్గించుకుంటున్నారు. ఒకటి రెండు మినహా మిగిలిన విశ్వవిద్యాలయాలు ఆయనకు తలొంచాయి. మీడియా సరేసరి. పర్యవసానంగా ఆయన తలచుకున్నదే ధర్మం, ఆయన అమలుచేసేదే న్యాయం! మన పురాణాల్లో వైరభక్తి అనేది ఒకటుంది. శాపవశాత్తూ శ్రీమహావిష్ణువుకు దూరం కావాల్సివచ్చిన ద్వారపాలకులు జయవిజయులు... సత్వర శాపవిమోచనకు ఆయనతో మూడు జన్మల్లో వైరానికి దిగి, ఆయన చేతుల్లోనే హతమారి తిరిగి చేరువవుతారు. ట్రంప్-మస్క్ వైరం నిండా నెల్లాళ్లయినా కొనసాగలేదు. ట్రంప్-మస్క్‌ల బంధం ఏడాది క్రితం వరకూ ఎవరూ ఊహించలేదు. మస్క్ తన దారిన తాను 'ఇన్నొవేషన్ గురు' అనిపించుకుంటూ ప్రయోగాలు చేశారు. భవిష్యత్తంతా ఎలక్ట్రిక్ కార్లదే అని నమ్మి ఖరీదైన టెస్లా కారును ఆవిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన ట్విటర్‌ను కొన్నాడు. ఈ భూమికి భవిష్యత్తు లేదని, అంగారకుడిపై ఆవాసాలు నిర్మించుకోవటమే ప్రత్యా మ్నాయమని అందరి చెవుల్లో హోరెత్తుతూ నిజమేనని భ్రమింపజేస్తున్నాడు. ఈలోగా హైపర్‌లూప్ రైళ్ల ఆలోచనను వదిలారు. ఇంతలో డెమాక్రటిక్ పార్టీ పెద్దలతో, ముఖ్యంగా మొన్న అధ్యక్ష ఎన్ని కల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కమలా హ్యారిస్‌తో తేడా వచ్చింది. తాను భారీగా విరాళాలి చ్చినా తన కొత్త సాంకేతికతలను నిర్లక్ష్యం చేశారని అలిగాడు. అంతే... ఉదారవాదానికి స్వస్తిపలికి నిరుడు మితవాది ట్రంప్‌కు చేరువయ్యాడు. ఆయన ప్రచార సభలకైన వ్యయంలో అత్యధిక వాటా మస్క్‌దే. దాదాపు 30 కోట్ల డాలర్ల విరాళం ఇవ్వటమే కాదు... వచ్చే ఏడాది నవంబర్‌లో 435 స్థానా లుండే ప్రతినిధుల సభకు జరగబోయే ఎన్నికలకు 10 కోట్ల డాలర్లు ఇవ్వటానికి వాగ్దానం చేశాడు. ట్రంప్-మస్క్‌ల మైత్రి ఉభయతారకమైనది. ట్రంప్‌కు సొంతంగా ఉన్న సామాజిక మాధ్యమం ట్రూత్, మస్క్ నేతృత్వంలోని ఎక్స్ ఒక్కటై అమెరికా ప్రజానీకాన్ని తమ దారికి మళ్లించుకోవటంలో కృతకృత్యులయ్యారు. డెమాక్రటిక్ పార్టీ ప్రచార లోపాలు కూడా తోడవటంతో అవలీలగా ట్రంప్ విజయం సాధించారు. అధికారంలోకొచ్చాక ప్రభుత్వోద్యోగులను సాగనంపే డోజ్‌లో కీలకపాత్ర పోషించాలని మస్క్ ఉబలాటపడినా అది కాస్తా వివేక్ రామస్వామికి పోయింది. 'ఉరితీతలు కాదు... ఊచకోతలే' అంటూ భారీయెత్తున సిబ్బందిని కత్తిరిస్తానని చెప్పిన మస్క్‌కు అది నిరాశ కలిగించినా, త్వరలోనే వివేక్ నిష్క్రమించేలా చేయగలిగారు. తనకు సన్నిహితుడైన జేర్డ్ ఐజాక్ మాన్‌కు అంతరిక్ష సంస్థ నాసా బాధ్యతలు అప్పగించాలన్నది మస్క్ ఆకాంక్ష. అదే జరిగితే సొంత సంస్థ స్పేస్ ఎక్స్‌కు నాసాను తాకట్టుపెడతాడన్న భయం ట్రంప్‌కు లోలోన ఉంది. ఈ సంగతి అర్థమైన నాటినుంచీ మస్క్ రగిలిపోయారు. పర్యవసానంగా ట్రంప్ అత్యద్భుతమని ప్రకటించిన పన్ను కోతల బిల్లును ఆయన తప్పుబట్టారు. ఒకపక్క తాను ప్రభుత్వ సిబ్బందిని సాగనంపి ఖజానా కళకళల్లాడేలా చేస్తుంటే, ప్రభుత్వ రుణభారాన్ని మరో 3 లక్షల కోట్ల డాలర్లకు పెంచే పన్నుల తగ్గింపేమిటన్నది మస్క్ ప్రశ్న. తన కాంట్రాక్టు ముగిశాక మొదటగా ఆయన దీన్నే ఎత్తు కున్నారు. తనతో ఇన్నాళ్లూ కలిసిమెలిసి తిరిగి, మొదటినుంచీ ఈ బిల్లుపై అవగాహన ఉన్న మస్క్ ఇలా విమర్శించే సరికి ట్రంప్ ఆగ్రహం పట్టలేకపోయారు. ఆ తర్వాత జరిగిందంతా బహిరంగ యుద్ధం! వచ్చేసారి ఎన్నికల్లో డెమాక్రాట్లకు ఆర్థిక సాయం అందిస్తానన్న బెదిరింపు మొదలుకొని బాలలపై లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎపిస్టిన్‌తో ట్రంప్‌కు గల సంబంధాలు బయటపెడతాననేవరకూ మస్క్ మాటలు జారారు. ప్రతిగా స్పేస్ ఎక్స్ కాంట్రాక్టులు రద్దుచేస్తానని, ఇవ్వబోయే కాంట్రాక్టులు జెఫ్ బెజోస్ నేతృత్వంలోని బ్లూ ఆరిజన్‌కూ, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ ఉమ్మడి భాగస్వామ్య సంస్థ యునైటెడ్ లాంచ్ అలయెన్స్‌కూ కట్టబెడతానని ట్రంప్ బెదిరించారు. డెమాక్రాట్లకు విరాళమిస్తే పర్యవసానాలెలా ఉంటాయో చూపిస్తానని హెచ్చరించారు. తీరిగ్గా లెక్కలేసుకున్నాక ఈ కయ్యం వల్ల కలిసొచ్చేదేమీ లేదని మస్క్ గ్రహించినట్టున్నారు. 'కాల్పుల విరమణ' ప్రకటించటంతోపాటు 'సారీ' చెప్పారు. ఏడాది నుంచి అవిభక్త కవలల్లా ఎక్కడికెళ్లినా జంటగా పోతూ, మస్క్‌ను 'సహ అధ్యక్షుడు' అని అందరూ వేళాకోళం చేసేలా వ్యవహరించిన వీరిద్దరూ మునుపటి మాదిరే మళ్లీ సన్నిహితులవుతారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. హృదయం అద్దం లాంటిది, పగిలితే అతకదంటారు. కనుక చెలిమి చిగురించినా మునుపటి స్థాయిలో ఉండకపోవచ్చు. కానీ ఈ ఉపాఖ్యానంలో ప్రపంచ ప్రజానీకం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఒకటుంది. వ్యక్తులైనా, పార్టీలైనా పరస్పరం లాభదాయకం, పంపకాలు బాగుంటాయనుకుంటే కూటములు కడతారు తప్ప, తమను ఉద్ధరించటం కోసం కాదని వారు గ్రహించాలి.

Printed by RATNA GRAPHICS, at H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Published by CHERUKU UPENDAR on behalf of CHERUKU UPENDAR ( HAMSA PUBLICATIONS ), Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana. *Editor : CHERUKU UPENDAR E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555